# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ మంగళవారం | 1 ఏప్రిల్ 2025 | ■ 12 పేజీలు




- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రజ్వరిల్లిన భక్తి ప్రభ..
- భక్తి శ్రద్ధలతో రంజాన్ పండుగ వేడుకలు
- ఈద్గాలు, మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- ప్రవక్త బోధనలు వినిపించిన మతపెద్దలు
- రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు
- ప్రత్యేక ప్రార్థనలతో కిక్కిరిసిన ఈద్గాలు, మసీదులు
- ప్రార్థాన మందిరాల వద్ద పోలీసుల బందోబస్తు
- పండ్లు, పానీయాలు అందజేసిన స్వచ్ఛంద సంస్థలు

........... సమగ్ర వార్తలు, దృశ్యమాలిక లోపలి పేజీల్లో

'యా అల్లాహ్... తేరా రహీం వో కరం హమ్‌పర్ బర్సా.. నారయ తక్డీర్.. అల్లాహో అక్బర్..!' అంటూ సామూహికంగా ప్రార్థించారు.. నెలవంక దర్శనం నేపథ్యంలో రంజాన్ పర్వదినాన్ని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ముస్లిం సోదరులు సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు.. నూతన వస్త్రాలు ధరించారు. బంధువులకు, స్నేహితులతో కలిసి ఆత్మీయంగా అత్తర్లు చల్లుకున్నారు.. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు ప్రవచనాలు చెప్పారు.. బంధువులు, మిత్రులకు ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు.. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులు ముస్లింలకు రంజాన్ ముబారక్ చెప్పారు. మతాలకతీతంగా అలయ్ బలయ్ తీసుకుని తమది గంగా-జమున తెహజీబేనని చాటి చెప్పారు.



# ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

## ఉపాధిహామీ కూలి పెంపుపై నిరాశ



10

- పెంచలేదని అనకుండా..
- గతేడాది 28 రూపాయలు పెంచిన ప్రభుత్వం
- ఈసారి కేవలం 7 రూపాయలే
- పెంచిన దానితో రూ.307కు చేరినఉపాధి కూలీ
- ఆశించిన మేరకు వేతనాలు పెంచక పోవడంతో నిరాశకు గురవుతున్న కూలీలు

మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆశించిన మేరకు వేతనాలు పెంచక పోవ డంతో కూలీలు నిరాశకు గురవుతున్నారు. గతేడాది 28 రూపాయలు పెంచిన ప్రభుత్వం ఈసారి కేవలం 7 రూపాయలు మాత్రమే పెంచి వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఇతర వస్తువుల ధరలు పెరుగుతుండగా, వాటికి అనుగుణంగా ఉపాధి హామీ వేతనాలు పెరగడం లేదు. ప్రస్తుతం ఉపాధిహామీ కూలీ వేతనం రూ.300 ఇస్తుండగా, పెంచిన 7 రూపాయలతో 307కు చేరుకున్నది.

### ఆదిలాబాద్‌లో సూపర్ స్టార్ ది గ్రేట్ ఖలీ సందడి

డబ్ల్యూడబ్ల్యూఈ సూపర్ స్టార్ ది గ్రేట్ ఖలీ సోమవారం ఆదిలాబాద్‌లో సందడి చేశారు. కరీంనగర్‌లో ఓ కార్యక్రమానికి హాజరై ముంబాయికి తిరుగు ప్రయాణంలో వెళ్లే క్రమంలో మార్గమధ్యలో ఆదిలాబాద్‌లోని బీజేపీ నేత ఆదిత్య ఖండేష్కర్ గెస్ట్ హౌస్‌లో కాసేపు సేద తీరారు. ఖలీ వచ్చిన విషయాన్ని తెలుసుకున్న పట్టణ యువకులు ఆయన అభిమానులు ఆయన్ని కలిసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా గ్రేట్ ఖలీ మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌తో తనకు అనుబంధం ఉందన్నారు.



## పేదలకు ఇక సన్న బువ్వ

10



- నేటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ
- సర్వం సిద్ధం చేసిన అధికారులు..
- జిల్లాల్లో ముఖ్యనేతలతో ప్రారంభం
- ఆదిలాబాద్ జిల్లాలో 356 దుకాణాలు
- నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 412
- మంచిర్యాల జిల్లాలో 423 షాపులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కార్డుదారులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించనుంది. ఉగాది కానుకగా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానుంది. తెల్ల రేషన్ కార్డు కలిగిన లబ్దిదారుల కుటుంబంలోని ఒక్కొక్కరికి ఆరుకిలోల చొప్పున సన్నబియ్యం పోసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే చౌకధరల దుకాణాలకు సన్నబియ్యం స్టాకు కూడా చేరింది. పౌరసరఫరాల అధికారులు దీని కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సన్నబియ్యం పంపిణీపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



### గ్రూప్-1 ఫలితాల్లో గిరిజన యువతి సత్తా

- రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు
- ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకు
- లింగాపూర్‌కు చెందిన వజన -12

### భీమిని కస్తూరిబా విద్యాలయంలో విచారణ

- విద్యార్థినులను కొట్టింది బయోసైన్స్ ఉపాధ్యాయురాలు..
- విచారణలో తేలిన నిజం -12





## నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూతగా
# రాజీవ్ యువ వికాసం
### కలెక్టర్ల వీడియోకాన్ఫరెన్సులో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం) రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజీవ్ యువ వికాస పథకం ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఆర్థిక చేయూతనందించి వివిధ రంగాలలో వారు రాణించేలా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. వీలైనంత ఎక్కువ మంది అర్హులకు లబ్ది చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్.సి., ఎస్.టీ., బి.సి., మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకై ఈ పథకం ద్వారా చేయూత అందించడం జరుగుతుందని, తద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందని అన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 5, 2025 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని తెలిపారు. 50 వేల రూపాయల లోపు రుణం 100 శాతం మాఫీ, 1 లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం రాయితీ, 1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ, 2 లక్షల రూపాయల నుంచి 4 లక్షల రూపాయల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని, రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 1 లక్ష 50 వేల రూపాయల లోపు ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం 2 లక్షల రూపాయల లోపు ఉండాలని తెలిపారు. అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలన్నింటినీ మున్సిపల్ / మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాలలో అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హత గల నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. దినపత్రికలు, ప్రసార సాధనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల వరకు ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం నిర్వహిస్తున్నామని, జిల్లాలో అర్హత గల వారికి దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన ధ్రువపత్రాల జారీలో సంబంధిత తహసిల్దార్ల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి పురుషోత్తం నాయక్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల అభివృద్ధి శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## జిల్లాలో 30 పోలీస్
# యాక్ట్ అమలు
### కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం) కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంత వాతావరణ పరిస్థితులను మరింత సజావుగా కొనసాగించడానికి మార్చి 31 వ తేదీ నుండి ఏప్రిల్ 30 వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉన్నందున జిల్లాలో డిఎస్పి లేదా ఆపై పోలీస్ ఉన్నతాధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఏలాంటి ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, తదితర ప్రజలు గుమికూడి ఉండేవిధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



# అరకొరగా వైద్యులు.. అందుబాటులో లేదని మందులు

బేల, మార్చి 31 (ప్రభాత సమాచారం) 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అన్న పాటను తలపిస్తున్నది బేల ప్రభుత్వ ఆసుపత్రి దుస్థితి. అక్కడ వైద్యులు ఉంటే మందులు ఉండవు. మందులుంటే వైద్యులు ఉండరు. అన్ని టెస్టులు అందుబాటులో ఉండవు. సదుపాయాలూ అరకొరగానే ఉన్నాయి. దాంతో జనం టెస్టుల కోసం, మందుల కోసం ప్రైవేట్‌కు వెళ్లాల్సి వస్తోంది. బేల మండలవ్యాప్తంగా 52 గ్రామాలకు ఇది ఒకటే ఆసుపత్రి ఉంది. ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. ఇటీవల రాత్రి సమయంలో పురిటినొప్పులతో వచ్చిన నిండు గర్భిణీ పద్ద అవస్థలను చూసి సర్కారు దవాఖానా అంటేనే అమ్మో అనే పరిస్థితి నెలకొంది. బేల మండల కేంద్రంలోని ఈ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరత కూడా తీవ్రంగా వేధిస్తున్నది. 24 గంటలపాటు అందుబాటులో ఉండాల్సిన డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంతో రోగులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఒకే ఒక డాక్టర్‌కు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించడంతో ప్రతిరోజు ఉదయం వచ్చి మధ్యాహ్నమే



జిల్లా కేంద్రానికి వెళ్లిపోతున్నారు. దాంతో రోగులకు సరైన వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు పోవాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. జిల్లా కేంద్రానికి 35 కిలో మీటర్ల దూరంలో ఉన్న బేల మండల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతిరోజూ 100కు పైగా పేషంట్లు వస్తుంటారు. అందులో 20 నుంచి 22 మందికి ఆసుపత్రిలోనే చికిత్సలు చేయాల్సి వస్తుంది. కానీ ఇక్కడ సరైన సిబ్బంది లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి 24 గంటలు అందుబాటులో ఉండేలా డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని జనం వేడుకుంటున్నారు.

**రక్త పరీక్షలూ కష్టమే..**

ఈ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని గర్భిణీ స్త్రీలు, రోగులు వాపోతున్నారు. ఇక్కడ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న మహిళ తన పలుకుబడితో జిల్లా కేంద్రానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. దాంతో ఇక్కడి రోగులకు రక్త పరీక్షలు చేయాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సాధారణ జ్వరం, సీజనల్ వ్యాధులతో వచ్చిన వారికి మాత్రం టెస్టులు బయట చేయించుకోవాలని చెబుతున్నారు. కొందరికి మాత్రం విధుల్లో ఉన్న స్టాఫ్ నర్సులే రక్త పరీక్షల కోసం బ్లడ్ శాంపిల్స్ సేకరించి జిల్లా కేంద్రానికి పంపించడంతో ఆ పరీక్షలు సంబంధించిన రిపోర్ట్ రావడానికి వారం రోజులు పడుతుందని అంటున్నారు. దాంతో గత్యంతరం లేక ప్రైవేటులో వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ విధులు నిర్వహించాల్సిన ల్యాబ్ టెక్నీషియన్ ఆసుపత్రిలోనే అందుబాటులో ఉండే విధంగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# బీసీ గురుకుల ప్రవేశాల గడువు పొడిగింపు



ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం) మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6 నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న బ్యాక్ లాక్ సీట్ల భర్తీ కోసం దరఖాస్తు గడువు ఏప్రిల్ 6 వరకు పొడిగించినట్లు గురుకులాల జిల్లా కన్వీనర్ శ్వేత సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల గడువు మార్చి 31 వరకు ప్రకటించినప్పటికీ గురుకుల ఉన్నతాధికారుల ఆదేశానుసారం దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ముదురుతున్న ఎండలు... ఎండుతున్న ప్రాజెక్టులు





ఆదిలాబాద్ ప్రతినిధి, మార్చి 31 (ప్రభాత సమాచారం) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కింద సేద్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మార్చి నెల సగం నాటికే విపరీతమైన ఎండలు కాస్తుండడంతో ప్రాజెక్టుల్లో క్రమంగా నీటిమట్టం తగ్గుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇదే మే చివరినాటికి ప్రాజెక్టులు పూర్తిగా ఎండిపోయే పరిస్థితులు ఉండవచ్చని అధికారులు కూడా అంచనా వేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయానికి నీటి సరఫరా చేయడంతో పాటు మరోవైపు తాగునీటి అవసరాలను తీర్చేందుకు మిషన్ భగీరథకు నీటి సరఫరా ఉండడంతో... ఈ వేసవి ఎలా గట్టెక్కుతుందోనన్న ఆందోళన అన్ని వర్గాల్లోనూ ఉంది. ఉమ్మడి జిల్లాలోని ఆయకట్టుకు నీరందించే శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్, గడ్డన్నవాగు ప్రాజెక్ట్, స్వర్ణ ప్రాజెక్టులతో పాటు మత్తడివాగు, బోథ్ ప్రాజెక్ట్, భీమ్ ప్రాజెక్ట్ ప్రాజెక్టుల్లో రోజురోజుకు నీటిమట్టం తగ్గుతున్నది. కాగా కడెం ప్రాజెక్టు త్వరలోనే డెడ్ స్టోరేజ్‌కి చేరే అవకాశం ఉంది. దీంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

**తగ్గుతున్న ప్రధాన ప్రాజెక్టుల నీటిమట్టాలు..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో నీటిమట్టాలు క్రమంగా తగ్గుతున్నాయి ఉత్తర తెలంగాణకు ప్రధాన నీటి వనరు అయిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ కింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ మంచిర్యాల జిల్లాలకు సాగునీరు అందిస్తున్నారు. నిర్మల్ జిల్లాలో సుమారు 41 వేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు కడం ప్రాజెక్టు ఖాళీ అయితే ఫీడర్ ఛానల్‌గా ఆ ప్రాజెక్టుకు ఎస్సారెస్పీ నీరు అందితే మంచిర్యాల జిల్లాలోని పలు మండలాలకు సాగునీరు అందించే విధంగా సరస్వతి కాలువను డిజైన్ చేశారు. అయితే ప్రస్తుతం ఎస్సారెస్పీలో 1090 అడుగులకు గాను 1068 అడుగుల వద్ద ప్రాజెక్ట్ నీటిమట్టం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా నిర్మల్ ఆదిలాబాద్ జిల్లాలకు తాగునీటి అవసరాలు కూడా తీరుస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని ముధోల్ నియోజకవర్గంలో సుమారు 14 వేల ఎకరాలకు నీరు అందించే గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ నీటిమట్టం 358.70 అడుగులు కాగా ప్రస్తుతం 356 వద్ద ఉంది. కొంత ఆశాజనకమే అయినప్పటికీ భారీ ఎండలు ఈ ప్రాజెక్టుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. సారంగాపూర్ మండలం స్వర్ణ ప్రాజెక్టు నీటిమట్టం 11 83 అడుగులు కాగా ప్రస్తుతం 11 74 వద్ద నీటిమట్టం ఉంది. ఇప్పుడే ఈ పరిస్థితి ఉంటే మే నెల నాటికి ప్రాజెక్టు పరిస్థితి మరింత దిగజారే పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. యాసంగిలో చివరి ఆయకట్టు దాకా నీరు అందుతుందో లేదోనన్న ఆందోళన వ్యక్తం అవుతున్నది.

కడెం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 700 అడుగులు కాగా 684 అడుగుల వద్ద ఉంది. ఈ ప్రాజెక్ట్ త్వరలోనే డెడ్ స్టోరేజ్‌కి చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 టిఎంసిల సామర్థ్యం కాగా ఇప్పుడు 11 టిఎంసిల నీరుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిమట్టం తగ్గుతోంది. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న మత్తడ వాగు, బోథ్ ప్రాజెక్ట్, ఆసిఫాబాద్ జిల్లా కొమురం భీమ్ ప్రాజెక్టుల నీటి మట్టాలు కూడా క్రమంగా తగ్గుతున్నాయి.

# రాజీవ్ యువ వికాస్ పథకానికి గడువు పెంపు



**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకాలకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఈబీసీ బీడబ్ల్యూఎస్ కు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకొని ప్రజాపాలన సేవా కేంద్రం మండల పరిషత్ కార్యాలయం లో మున్సిపల్ కార్యాలయంలో అందచేయాలని, మీ-సేవా కేంద్రాలలో దరఖాస్తులు చేసుకొనేవారు అదనపు చార్జీలు చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఈ నెల 14 వరకు పొడిగించారని, ఆసక్తి గల వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా సోమవారం రాజీవ్ యువ వికాసం పథకంపై రాష్ట్ర డిప్యూటీ సిఎం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి, నిరుద్యోగ యువతకు వివిధ రంగాలలో అవకాశాలు కల్పించడం జరుగుతుందని అధికారులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సోమవారం సాయంత్రం ప్రజా భవన్ నుంచి ఆయన చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి పదివేల కోట్లు ఖర్చు చేస్తుందని, అధికారులు ఈ పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలని న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్ ని వివరించారు. ముఖ్యమంత్రి, తాను ఈ పథకం ప్రగతిపై నిరంతరం సమీక్షిస్తామని అన్నారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచడం జరిగిందనీ, జూన్ 2 న అర్హులకు మంజూరు పత్రాలు అందజేయాలని , జూన్ 2 నుంచి 9 వరకు ప్రతి రోజు ఒక మండలం చొప్పున నియోజకవర్గం అంతటా శాంక్షన్ లెటర్లు అందజేయాలని తెలిపారు. జూన్ 9 తర్వాత శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాలని, 50 వేల వరకు లబ్ధి పొందిన వారికి వారం రోజులపాటు, 50 వేల నుంచి రెండు లక్షల వరకు లబ్ధి పొందిన వారికి 15 రోజుల పాటు, 2 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. శిక్షణ పూర్తి చేసుకొని వచ్చిన వారికి వెంటనే గ్రౌండింగ్ చేసి నగదు అందజేయాలని కోరారు. జూలై మొదటి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ మొదలు గ్రౌండింగ్ వరకు నిరుద్యోగ యువత ఇబ్బందులు ఎదుర్కోకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి జిల్లాలో ఒక అధికారిని నియమించాలని పేర్కొన్నారు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామల దేవి, కమిషనర్ రాజు, ఈడి కార్పొరేషన్ మనోహర్, రాజ లింగు, రవి పాల్గొన్నారు.



## డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన ఎస్సై

**గుడిహత్నూర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గుడిహత్నూర్ ఎస్సై కరాండే మహేందర్ డీఎస్పీగా ఎంపికైయ్యారు. దీంతో సోమవారం రత్న సాన్వి వెల్ఫర్ సొసైటీ వ్యవస్థాపకుడు ఉప్పారపు సత్యరాజ్ ఎస్ఐ ని కలిసి అంబెద్కర్ చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూపట్టుదల, ఏకాగ్రతతో చదివి డిఎస్పీ ఉద్యోగా న్ని సాధించిన ఎస్సై మహేందర్ ను పలువురు యువకులు స్ఫూర్తిగా తీసుకొని ఉద్యోగాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అమరేశ్వర్, సతీష్, రాహుల్, గణేష్, అశోక్, రాంకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ నియోజకవర్గం బాబాపూర్ గ్రామ పంచాయతీలో సోమవారం రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావ్, సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ జగదాంబ దేవీ ఆలయంలో, తెలివాడలో హనుమాన్ మందిర్ లో ప్రారంభించారు. అలాగే భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేద్దాం అని హామీ ఇచ్చారు.

## మల్లయ్య జన్మదిన వేడుకలు



**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలో సోమవారం బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య 64వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, టీపీసీసీ సభ్యులు చిలుముల శంకర్, జిల్లా జనరల్ సెక్రెటరీ చిలువేరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు గెల్లి రాయలింగు, మాజీ ఫ్లోర్ లీడర్ బండి ప్రభాకర్, డీకొండ రాయలింగు, మాజీ పట్టణ అధ్యక్షులు కంకటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నిర్మల్ పట్టణంతో పాటు నిర్మల్ రూరల్, మామడ, లక్ష్మణ చందా, సోన్, సారంగాపూర్, నర్సాపూర్ (జి), దిలావార్పూర్ మండలాలకు చెందిన 137 లబ్ధిదారులకు రూ. 45 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్దిదారులకు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అందజేశారు.

## సమస్యలపై ఒత్తిడి తీసుకురావాలి




**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావాలని టిఏజిఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీఅన్నారు. సోమవారం హైదరాబాదులో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశానికి హాజరై జిల్లాలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలపై చిన్న చూపు చూపిస్తున్నాయని, కుమ్రంభీం పోరు గ్రామాలకు సైతం తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర కార్యవర్గం ప్రభుత్వాలను ఒత్తిడి చేయాలని అనేక సమస్యలతో ఆదివాసి గిరిజనులు కొట్టుమిట్టాడుతున్నారని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

## హనుమాన్ చాలీసా పారాయణం

**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి మండలంలోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఈనెల 2 (బుధవారం) సాయంత్రం 7 గంటల నుండి 3 (గురువారం) సాయంత్రం 7 గంటల వరకు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని నిర్వహిసున్నట్లు ఎండోమెంట్ ఆఫీసర్ బాపిరెడ్డి తెలిపారు. వసంత నవరాత్రులను పురస్కరించుకొని ఈ హనుమాన్ చాలీసా పారాయణాన్ని హనుమాన్ భక్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొనే హనుమాన్ భక్తులు మరిన్ని వివరాలకు 8520905114 లో సంప్రదించాలని వారు కోరారు.



## ఆధ్యాత్మికంగా ఉంటేనే ఆరోగ్యకరమైన భవిష్యతు

### మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ఆధ్యాత్మికంగా ఉంటేనే ఆరోగ్యకరమైన భవిష్యతు ఉంటుందని రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలో మాజీ కౌన్సిలర్ ఇమ్రాన్ ఉల్లా గృహంలో ఏర్పాటు చేసిన రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసం మహోన్నతమైనదని పేర్కొన్నారు. ముస్లిం సోదరులు తమ నిత్య ప్రార్థనలలో మత సమైక్యతతో పాటు దేశ సమగ్ర అభివృద్ధి కై భగవంతున్ని కోరుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, మాజీ ఎంపీపీ మహిపాల్ రెడ్డి, నాయకులు పాకాల రాంచెందర్, శ్రీకాంత్ యాదవ్, వినయ్, గజేందర్ అనుముల భాస్కర్, రవి, రాఘవేందర్ ముడుసు సత్యనారాయణ, నవీన్, నరేందర్, నీగులపు సంజీవ్ తదితరులున్నారు.

## కొనసాగుతున్న సీసీఐ సాధన కమిటీ దీక్షలు

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సోమవారం యువజన నాయకులు, వివిధ సంఘాల నేతలు కూర్చొని మద్దతు తెలిపారు. సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి ఆదిలాబాద్‌లోని సీసీఐ పునరుద్ధరణకు కృషి చేయాలని కోరారు.



# 3న నర్సరీ పండ్ల తోటల వేలం

### ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా



**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా ఉద్యాన నర్సరీ మామిడి పండ్ల తోటల వేలం ఏప్రిల్ 3న నిర్వహించనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. జంబుగా తోటలో బంగినపల్లి, దశేరి తోతాపురి, రసాలు, హిమాయత్, లాంగ్ర వంటి మామిడి హైబ్రిడ్ రకాలు ఉన్నాయని తెలిపారు. వేలంపాటలో మూడు సంవత్సరాలకు కలిపి (2025, 2026, 2027) పంట కాలానికి ఈ పండ్ల తోటల వేలం జరుగుతున్నట్లు తెలిపారు. ఎవరికైతే తోట దక్కుతుందో మూడు సంవత్సరాల పాటు వారే పూర్తి స్థాయిలో ఎరువులు వేయటం, సస్యరక్షణ చర్యలు చేపట్టటం వంటి యాజమాన్య పద్ధతులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు రూ.10,000/- (పదివేల రూపాయలు) ధారావత్తు సొమ్ముతో ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 11.00 గంటలకు జంబుగా ఉద్యాన నర్సరీలో జరిగే బహిరంగ వేలంలో పాల్గొనాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు. వేలంలో తోటను దక్కించుకున్నవారు సగం సొమ్మును వెంటనే చెల్లించాలి అని, మిగతా సొమ్మును వారం రోజుల్లో చెల్లించాలని సూచించారు. మొత్తం సొమ్ము చెల్లించిన తర్వాతనే కాయలు కోయటానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు ఐటిడిఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి లేదా సంబంధిత నర్సరీ సాంకేతిక అధికారులను ఫోన్ నంబర్లలో (8897478825, 94410 20755) సంప్రదించాలని పేర్కొన్నారు. అదే విధంగా పండ్ల తోటల సాగుతో రైతులు అధిక లాభాలు అర్జించి మంచి దిగుబడులను పొందవచ్చన్నారు. అతివృష్టి అనావృష్టి వల్ల అనేక కారణాల చేత రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగిరాక తీవ్ర నష్టాల ఊబిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకునేందుకు హార్టికల్చర్ ఎంతో తోడ్పాటు అందిస్తుందని హార్టికల్చర్ ద్వారా పండ్ల తోటలు సాగు చేసుకోవాలన్నారు.



# పార్కు నిర్మాణంపై పట్టింపేదీ?

**మధ్యలోనే ఆగిపోయిన రాముని చెరువు పార్కు పనులు**

**నిధులున్నా నిర్లక్ష్యం చేయడంపై అసహనం - స్పందించకుంటే ఆందోళనలు చేస్తాం : వాకర్స్ అసోసియేషన్**

**మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల పట్టణంలోని రాముని చెరువు పార్కు అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. కోట్లాది రూపాయల నిధులున్నా అధికారులు, పాలకుల పట్టింపులేని తనంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారింది. సువిశాలమైన 47 ఎకరాల రాముని చెరువు స్థలంలో పార్కు ఏర్పాటు చేసేందుకు 2022లో టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ.3.50 కోట్లు మంజూరయ్యాయి. పనుల చేజిక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ కొంతమేర పనులు చేపట్టి.. ఆపై బిల్లులు రావడం లేదన్న కారణంతో నిలిపివేశాడు.

**కొన్ని పనులు మాత్రమే..**
రూ. 3.50 కోట్లతో పార్కులో అభివృద్ధి పనులతో పాటు సుందరీకరణ పనులు చేపట్టాలని అప్పటి కౌన్సిల్ నిర్ణయించింది. రాముని చెరువు కట్ట, 2620 రన్నింగ్ మీటర్ల రెయిలింగ్, 1450 రన్నింగ్ మీటర్ల పాత్‌వేల నిర్మాణం, చెరువు కట్టపై గ్రీనరీ పెంచడం, కట్ట చుట్టూ 30 ఎల్ఈడీ స్తంభాలు, బతుకమ్మ ఆడే ప్రాంతంలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు చేయడం, బతుకమ్మ ఘాట్, వాహనాల పార్కింగ్ ఏరియా, సర్కులర్ బండ్ పోర్షన్‌వంటివి నిర్మించాల్సి ఉంది. కానీ, చెరువుకట్టకు రివిటింగ్, రెయిలింగ్, కట్టపై మట్టి పోయడంలాంటి పనులనే పూర్తిచేశారు. మిగిలిన పనులన్నీ అలాగే వదిలేశారు. అధికారులు, పాలకులు నిర్లక్ష్యంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోగా, స్థానిక ప్రజల్లో అసహనం వ్యక్తమవుతున్నది. ఇకనైనా స్పందించి పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

**పార్కు అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి...**
పార్కు పనులను వెంటనే ప్రారంభించాలి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు వెంటనే ఆదేశాలివ్వాలి. మూడేళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడానికి కారకులైన బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రాముని చెరువు కట్టపై ప్రతి రోజూ 300 మందికి పైగా వాకింగ్ చేస్తుంటారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయింది. వెంటనే పనులు ప్రారంభించక పోతే రాముని చెరువు వాకర్స్, సింగరేణి రిటైర్డ్ కార్మిక సంఘం, సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

**2001లో 47 ఎకరాలు అప్పగింత..**
2001లో అప్పటి రెవెన్యూ అధికారులు దాదాపుగా 47 ఎకరాల రాముని చెరువు స్థలాన్ని మున్సిపల్ అధికారులకు అప్పగించారు. ఆ సమయంలో చెరువు చుట్టూ కట్ట నిర్మించి, మొక్కలు నాటి, ఫుట్‌పాత్ ఏర్పాటు చేసి, విద్యుత్ దీపాలను అమర్చారు. పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కు నిర్మించారు. కొద్దిరోజుల తర్వాత పార్కు ఆలనాపాలనా మరచిపోయారు. ఆపై ఆ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ఉదయం వాకింగ్‌కోసం కొందరు రాముని చెరువు కట్టను ఉపయోగిస్తున్నారు. కానీ ప్రజలకు ఉల్లాసం పంచడంలో ఆ పార్కు పనికి రాకుండా పోయింది.

## శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్
# పాదయాత్ర ప్రారంభం

**కాగజ్‌నగర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
కొత్తపల్లి శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ పాదయాత్రను మంగళవారం ఉదయం దీక్ష భూమి కొత్తపల్లి నుంచి శ్రీ దీక్షగురు ప్రేమ్ సింగ్ బాపు ఆధ్వర్యంలో ప్రారంభించారు. వేలాదిగా భక్తులు, సేవాదళ్లు ఈ యాత్రలో పాల్గొంటూ భక్తిశ్రద్ధను చాటుకుంటూ, బంజారా సంప్రదాయాలను పరిరక్షిస్తూ ముందుకు సాగు తున్నారు. ఈ పాదయాత్ర శ్రీరామనవమి వరకు కొనసాగి, మహారాష్ట్రలోని పోరాఘడ్ 'బంజారా కాశీ' వరకు చేరుకోనుంది. మార్గమధ్యంలో భక్తులు పహెూరా దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ రోజు పాదయాత్ర కొత్తపల్లి నుంచి ఎక్స్ రోడ్డుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాగజ్ నగర్ మండలంలోని అనుకోడ నాయకులు ఈ యాత్రలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. సేవాలాల్ మహారాజ్ భక్తుల భక్తి, సేవా తత్పరత, వారి సాంస్కృతిక పరిరక్షణ యాత్ర విశేష ప్రాముఖ్యత సంతరించుకుంది.

# పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలకు మోగిన నగారా..!



**కాగజ్‌నగర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం, రిజిస్టర్ నెంబర్ 99 / 1990, కాగజ్‌నగర్ పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ నగారా మోగిందని ఎన్నికల ప్రధాన అధికారి వాసాల ప్రభాకర్ సోమవారం రోజున పేర్కొన్నారు. పట్టణ పద్మశాలి సేవా సంఘం భవనం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుండి ఏప్రిల్ 4 వరకు సాయంత్రం 5:30 నుండి 7:30 వరకు నామినేషన్ల స్వీకరణ నిర్వహించండం జరుగుతుంది తెలిపారు. ఏప్రిల్ 5 న సాయంత్రం 5:30 నుండి 7:30 వరకు నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీల్లో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన చేయడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 6 ఆదివారం సాయంత్రం 5:30 నుంచి 7:30 వరకు నామినేషన్ ఉపసంహరణ అనంతరం, పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటన ఏప్రిల్ 7న సాయంత్రం 5: 30ని నుండి 7: 30 మధ్య పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు జరుగుతుందన్నారు. ఏప్రిల్ 8 సాయంత్రం 5:30 నుంచి 7:30 వరకు నమూనా బ్యాలెట్ విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 9 నుండి 13 -4 -2025 వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవచ్చని తెలిపారు. ఎన్నికల నిర్వహణ తేదీ ఏప్రిల్ 14న ఉదయం 8:00 నుండి సాయంత్రం 4:00 గంటల వరకు సొనసాగుతుందన్నారు. సాయంత్రం 5:00 నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాల ప్రకటన, గెలిచిన అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాల అందజేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల అధికారులు కటుకం మధుకర్,మామిడాల తిరుపతయ్య, హనుమాన్ల సుధాకర్, గడదాసు గోపి, గూడెపు విజయరావ్, భోగ మధుకర్, హనుమాన్ల రవీందర్, కొప్పుల మోహన్, తౌటం శ్యాంసుందర్, న్యాయ సలహాదారులు పరికిపండ్ల సతీష్ కుమార్, నల్ల కనకయ్య ,ఇరుకుల్ల ఆంజనేయులు, గుల్లపల్లి ఆనంద్ సిందం చంద్రయ్య, కొంగ సత్యనారాయణ, గడదాసు మల్లయ్య, సిందం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 3న మామిడి, సరుగుడు
# చెట్ల బహిరంగ వేలం

**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కన్నాల గ్రామ ఉద్యానవన నర్సరీలో ఏప్రిల్ 3న మామిడితోట, సరుగుడు చెట్ల బహిరంగ వేలం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యానవన అధికారి సుప్రజ తెలిపారు. బహిరంగ వేలంలో పాలొనేవారు సరుగుడు చెట్లకు రూ.5వేలు, మామిడి చెట్లకు రూ.వెయ్యి ధరావత్తు ముందస్తుగా చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8977713955ను సంప్రదించాలని ఆమె సూచించారు.

# రోడ్డు నిర్మాణంలో నాణ్యతా లోపం

**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
వేమనపల్లి మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల అభివృద్ధి కొరకు మంజూరయిన 80,00,000 లక్షల రూపాయలతో పలు గ్రామాలలో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు ఏట మధుకర్ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ వాడలో సీసీ రోడ్డును పరిశీలించారు. నాసిరకం ఇసుకను వాడుతున్నారని, మట్టి కలిసిన ఇసుకను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. రోడ్డు కొలతలకు తగినట్లు ఉండటం లేదని తెలిపారు. రోడ్డు వెడల్పు ఉన్నపటికీ మధ్యలో ఇసుకను పోసి రోడ్డు కాంక్రీట్ మందాన్ని తగ్గిస్తున్నారని, అదేవిధంగా రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు దానికి ప్రతిరోజు నీళ్ళను క్యూరింగ్ చేయడం లేదని ఆరోపించారు. దీంతో వేసవలో పగుళ్లు ఏర్పడి రోడ్డు పూర్తిగా చెడిపోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోయారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



# ఏరియాలో 78 శాతం బొగ్గు ఉత్పత్తి

## సింగరేణి ఏరియా జిఎం దేవేందర్



**మందమర్రి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**
2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలలో కేవలం 78 శాతం మాత్రమే బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే బొగ్గు ఉత్పత్తి తగ్గిందని ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్ తెలిపారు. ఏరియాలోని జిఎం కార్యాలయం ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వార్షిక బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. ఏరియాకు గత ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన 34.6 లక్షల టన్నులకు గాను 27.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందన్నారు. ఏరియాలోని కేకే-5 గని 103 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించగా, కాసిపేట గని 62% కాసిపేట 2 గని 59%, శాంతిఖని 47%, ఆర్కేపి ఓసి 139%, కేకే ఓసీలో 63% బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందన్నారు. ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలలో ఏడు లక్షల 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి వెనుకబడిందని రానున్న రోజుల్లో ఏరియాలో బొగ్గు ఉత్పత్తి మెరుగుపరిచి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఏరియాలోని శాంతిఖనిలో మూడవ సీమ్, నాలుగో సీమ్‌లలో త్వరలో రెండు నూతన ప్యానెల్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా నూతన మ్యాన్ రైడింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని శాంతిఖనిలో నూతన ప్యానల్ ద్వారా బొగ్గు ఉత్పత్తి మెరుగుపడుతుందన్నారు. అంతేకాకుండా నూతనంగా లాంగ్ వాల్ టెక్నాలజీ ద్వారా బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరిగిందన్నారు. 681 హెక్టార్ల భూసేకరణ జరిపి 8 మిలియన్ టన్నుల బొగ్గును వెలికి తీయనున్నామని వివరించారు. కేకే-5 గనికి మరో నాలుగు సంవత్సరాల జీవితకాలం ఉందని త్వరలో నూతన ప్యానెల్ ఏర్పాటు చేసి బొగ్గు ఉత్పత్తి మెరుగుపరుస్తామన్నారు. వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఏరియాకు 27.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిర్దేశించడం జరిగిందని నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు అవకాశాలు ఉన్నాయని కార్మికులు అధికారులు యూనియన్ నాయకుల సమిష్టి కృషితో వచ్చే ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏరియా ఎస్ఓటు జిఎం విజయ ప్రసాద్, ఐఈడి రాజన్న, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డివైఎస్ఈ సివిల్ రాము, వెంకటరమణ పాల్గొన్నారు.

# శ్రీరామనవమి శోభాయాత్ర పోస్టర్లు ఆవిష్కరణ



**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం శ్రీరామనవమి సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలో భారీ శోభాయాత్ర చేపడుతున్నట్లు శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యుడు రాళ్ల బండి మహేందర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆదిలాబాద్‌లో రామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సర్వసతితో కలిసి శ్రీరామనవమి శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఏప్రిల్ 6న సాయంత్రం గోపాలకృష్ణ మఠం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ శోభాయాత్రకు హిందువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శ్రీరామనవమి ఉత్సవ సమితి సభ్యులు గంద్రత్ మహేందర్, మద్నే సురేందర్, అభియాదవ్, నిఖిల్, సచిన్, చాణక్య, సాయి, మింటు, అర్జున్, అజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## లొద్దిగూడ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్తాం

### బీజేపీ మండల అధ్యక్షుడు జ్ఞానేశ్వర్

**జైనూర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

మండలంలోని డబోలి పంచాయతీలో గల లొద్దిగూడ ఆదివాసుల సమస్యలను ఆదిలాబాద్ ఎంపీ గోడాం నగేష్ దృష్టికి తీసుకెళ్తానని బీజేపీ మండల అధ్యక్షుడు మేస్రాం జ్ఞానేశ్వర్ ను సోమవారం తెలిపారు. జ్ఞానేశ్వర్ లొద్దిగూడను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివాసులతో ఆయన సమావేశం అయ్యారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆదిలాబాద్ ఎంపీ గోడాం నగేష్ దృష్టికి తీసుకెళ్లి వాటిని త్వరగా పరి ష్కరిస్తామన్నారు. తమకు రాకపోకలకు రోడ్డు సదు పాయం లేదన్నారు. తాగు నీటి కోసం వాగు పక్కకు చె లిమె ఏర్పాటు చేసి కలుషిత నీటిని తాగుతున్నామని వారు వివరించారు. వర్షాకాలంలో వ్యాధులు వస్తే ఎడ్ల బండి ద్వారా సమీప ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందని వారు వాపోయారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీ రామారావు ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్లలోనే నివసిస్తున్నామని అవి ఇప్పుడు శిథిలావస్థకు చేరుకున్నాయని పేర్కొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యల్ని ఎంపీతో పాటు అధికారులకు వివరించి న్యాయం చేస్తామని బీజేపీ నాయకులు వారికి హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు రాథోడ్, ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



**పెంబి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

విద్యుత్ షాక్ తో ఓ రైతు మృతి చెందిన ఘ టన నిర్మల్ జిల్లా పెంబి మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మండ్లు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నా యి. మండలంలోని వేణునగర్ గ్రామానికి చెందిన రైతు యగు ఆత్రం నాగోరావు (37) సోమవారం తన ఇంటి నుంచి మందపల్లి గ్రామ శివారులో తన మొక్కజొన్న చేనుకు పిట్టల కాపలా, నీరు పెట్టడానికి ఉదయం 5:30 గంటలకు బయల్దేరాడు. అయితే, మధ్యాహ్నం 12 గంటల సమయంలో మృతుని తమ్ముడు ఆ చేనుకు వెళ్ళగా, అతడు కరెంట్ షాక్ తగిలి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడు మోటర్ ను ఆన్ చేయగా ప్రమాద వశాత్తు కరెంట్‌షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఆత్రం సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మైనార్టీల సంక్షేమానికి కృషి

**బోథ్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రంలో రంజాన్ పర్వదినాన్ని పుర స్కరించుకుని ఈద్గా వద్ద ముస్లింలకు బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యకర్తల ఇంటికి వెళ్లి స్వీట్లు, సేమియాలు సేవించి కార్యకర్తల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని బోథ్ ఈద్గా అభివృద్ధి చేస్తామని, మదర్సాలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## చెన్నూర్‌లో వైద్య సేవల అభివృద్ధికి కృషి

### చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్



**చెన్నూర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

చెన్నూరు నియోజకవర్గంలో వైద్య సేవల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని నియోజకవర్గంలో కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో వన్ మెడి హబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ మెడికల్ క్యాంపును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మొబైల్ మెడికల్ క్యాంపులో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని గ్రామీణులు, పట్టణ ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రజలు తమ ఆహార అలవాట్లను మార్చుకొని పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించేందుకు వన్ మెడి హబ్ సంస్థ ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, వైద్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కల్లు దుకాణాలపై పోలీసుల దాడులు



**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

మావల, ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం జిల్లా అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రూరల్ సిఐ ఫనిధర్ అధ్వర్యంలో అక్రమంగా నిర్వహిస్తున్న పలు కల్లు కాంపౌండ్సలలో రైడ్ నిర్వహించారు. ఈ రైడ్‌లో భాగంగా ఇద్దరు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. వీటితో పాటు నాలుగు కేసులు ఎక్సైజ్ శాఖకు అందజేసినట్లు రూ. రల్ సీఐ ఫనిధర్ తెలియజేశారు. విడీసీలు ప్రభుత్వ అను మతులు లేకుండా కళ్ళు కాంపౌండ్స్ నిర్వహిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చ రించారు. అసాంఘిక కార్యకలాపాలపై జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక దృష్టి సారించి, చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రూరల్ సర్కిల్ పరిధిలో మాపల పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టి సావర్గంలో కల్లు కాంపౌండ్ నిర్వహిస్తున్న నాగరాజు గౌడ్ అనే వ్యక్తిపై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో యాపలగూడ గ్రామంలో విడిసికి డబ్బులు చెల్లింది. ప్రభుత్వ అనుమతి, లైసెన్స్ లేకుండా కళ్ళు కాంపౌండ్ నిర్వహిస్తున్న దినేష్ గౌడ్ , యాపలగూడా వీడీసీపై కేసు నమోదు చేయడం జరిగిందని రూరల్ సీఐ కె ఫణిందర్ తెలిపారు. అదేవిధంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తంతోలి గ్రామం. బంగారి గూడ గ్రామం, బృందావన్ కాలనీ, చిట్యాల బోరి గ్రామంలో అక్రమంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కళ్ళు కాంపౌండ్లపై నాలుగు ఎక్సైజ్ కేసులు నమోదు చేసి, ఎక్సైజ్ శాఖకు అందజేసినట్లు తెలిపారు. రూరల్ సీఐ తో పాటు సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై ముజాహిద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 3న విద్యార్థి సంఘం ఎన్నికలు



**గాదిగూడ, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలోని పిట్టలవాడ ఆదివాసీ భవనంలో ఏప్రిల్ 3వ తేదీన ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ జిల్లాధ్యక్షుడు దాదిరావు సూచించారు. సోమవారం గాదిగూడలో విలేకరుల సమావేశంలో అయన పాల్గొని మాట్లా డారు. తుడుందెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఎన్నికలకు ఆదివాసీలు హాజరుకావాలని కోరారు. సంతోష్, తదితరులున్నారు.

## 'యువ వికాసం'లో అర్హులందరికీ అవకాశం

### వీడియోకాన్ఫరెన్సులో ఉపముఖ్యమత్రి మల్లు భట్టి విక్రమార్క




**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు చేయూత అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులందరికీ అవకాశం కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్ యువ వివకాస పథకం ద్వారా వీలైనంత ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో దాదాపు అయిదు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు ఈ పథకం ద్వారా చేయూత అందిస్తామన్నారు. తద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందని వివరించారు. అర్హులైన వారు ఏప్రిల్ 14 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. రూ.50 వేల లోపు రుణాలకు 100 శాతం రాయితీ, లక్ష నుంచి రెండు లక్షల వరకు 80 శాతం, రెండు నుంచి నాలుగు లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుందని వివరించారు. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణాల ద్వారా అందిస్తామని తెలిపారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు ఉండాలని, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షల రూపాయల లోపు ఉండాలన్నారు. అంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాజీవ్ యువశక్తి వికాసం పథకానికి వీలైనంత ఎక్కువ మంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. దినపత్రికలు, ప్రసార సాధనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా హాజరయ్యారు.

## గాయపడ్డ యువకుడు మృతి

**ముథోల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**



ముధోల్‌లోని దనుగరిగల్లీకి చెందిన యూరేకర్ పోతన్న (27)అనే యువకుడు నిజామాబాదులో చికిత్స పొం దుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మృతు డు గత రెండు రోజుల క్రితం ముథోల్‌లోని ఓ విద్యుత్ స్తంభాన్ని ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టాడు. ఈ ప్రమా దంలో తీవ్ర గాయాలపాలైన పోతన్నను కుటుంబ సభ్యు లు చికిత్స నిమిత్తం భైంసా ఆసుపత్రికి తరలించారు. పరి స్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నిజామా బాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న పోత`న్న సోమవారం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# యువ వికాసం పై విస్తృత ప్రచారం చేయండి

## వీడియోకాన్ఫరెన్సులో ఉప ముఖ్యమంత్రి విక్రమార్క




నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)
రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకో వాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకంపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకై ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు ద్వారా రాష్ట్రంలో నిరుద్యోగం తగ్గుతుందన్నారు. అర్హులైన వారు ఏప్రిల్ 14, 2025 లోపు దరఖాస్తు చేసుకునే విధంగా అధికారులు నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలన్నారు. 50 వేల రూపాయలలోపు రుణం వంద శాతం మాఫీ, లక్ష రూపాయల లోపు రుణం 90 శాతం మాఫీ, లక్ష నుంచి రూ.2 లక్షల వరకు 80 శాతం రాయితీ. 2లక్షల రూపాయల నుంచి రూ.4 లక్షల వరకు 70 శాతం రాయితీ లభిస్తుంది. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకు లోన్ల ద్వారా అందిస్తారు. ఈ పథకం కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ. 1.50 లక్షలలోపు ఉండాలని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయం రూ.2 లక్షలలోపు ఉండాలన్నారు. అర్హులందరూ దరఖాస్తులు చేసుకున్న తర్వాత సంబంధిత పత్రాలన్నింటినీ మున్సిపల్ లేదా ఎంపీడీవో కార్యాలయాల్లో అందించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో భాగంగా జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరం నుంచి అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్ మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా శాఖల ద్వారా పలుమార్లు పత్రిక ప్రకటనలు ఇచ్చామన్నారు. గ్రామీణ స్థాయిలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఎక్కువమంది దరఖాస్తులు చేసుకునే విధంగా యువతను ప్రోత్సహించే విధంగా అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో రాజీవ్ యువ వికాసం పథకానికి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, మైనార్టీ అధికారి మోహన్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

---

### గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో

# ఫ్రిజర్ అందజేత

జన్నారం, మార్చి 31 (ప్రభాత సమాచారం)
జన్నారం మండలం కోటి గూడ గ్రామంలో రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి మృతదేహం ఫ్రిజర్ కొనుగోలు చేసి సోమవారం గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపకుడు సేపూరి గోపాల్ మాట్లాడుతూ రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి ఏర్పాటయి 6 సంవత్సరాలు గడిచినప్పటికీ ఇప్పటివరకు కమిటీ నుండి 8లక్షల పైబడి ఆర్థిక సహాయాలు చేసామని భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని గల్ఫ్ కార్మికులకు కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటూ గ్రామాభి ఐ వృద్ధి, ప్రజాసేవకు కమిటీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంద న్నారు. మృతదేహం ఫ్రిజర్ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. మృతదేహం ఫ్రిజర్ అవసరం ఉన్నవారు 9999753990 సేపూరి గోపాల్, 9888999974-పాలాజీ శ్రీనివాస్, 6305174200 శివనూరి శ్రీనివాస్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటిగూడ గల్ఫ్ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బంది, చింతగూడ గల్ఫ్ సంఘం నాయకులు, తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

---

### ఆదిలాబాద్‌లో సూపర్ స్టార్

# ది గ్రేట్ ఖలీ సందడి

**ఖలీని సన్మానించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్**
**ఖలీని చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన యుకులు**
**ఖలీలో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డ రాజకీయ నాయకులు**



ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)
డబ్ల్యూడబ్ల్యూఈ సూపర్ స్టార్ ది గ్రేట్ ఖలీ సోమవారం ఆదిలాబాద్‌లో సందడి చేశారు. కరీంనగర్‌లో ఓ కార్యక్రమానికి హాజరై ముంబాయికి తిరుగు ప్రయాణంలో వెళ్లే క్రమంలో మార్గమధ్యలో ఆదిలాబాద్ లోని బీజేపీ నేత ఆదిత్య ఖండేష్కర్ గెస్ట్ హౌస్‌లో కాసేపు సేద తీరారు. ఖలీ వచ్చిన విషయాన్ని తెలుసుకున్న పట్టణ యువకులు, ఆయన అభిమానులు ఆయన్ని కలిసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ది గ్రేట్ ఖలీ తో రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు, యువకులు సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే పాయల్ శంకర్ ది గ్రేట్ ఖలీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. ఖలి ఆదిలాబాద్‌కు రావడం పట్ల హర్షం ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రేట్ ఖలీ మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌తో తనకు పాత అనుబంధం ఉందని తెలిపారు. ఆదిత్య ఖండేష్కర్ తనకు మంచి మిత్రుడని, గతంలో పలుమార్లు ఆదిలాబాద్‌కు వచ్చిన తనకు ఇక్కడి ప్రజల ఆదరాభిమానం ఎంతగానో నచ్చిందన్నారు. చుట్టు పక్కల ఎక్కడ కార్యక్రమాలు జరిగినా ఆదిలాబాద్‌కు తప్పకుండా ఆదిలాబాద్‌కు వస్తానని ఖలీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు.

---

### గ్రామస్తులు ఎవరూ

# ఆందోళన చెందవద్దు

- దాడిసింది చిరుపులి కావచ్చు..
- పులిగా నిర్ధారించని అటవీఅధికారులు
- చిరుత, లేదా మరేదైనా కావచ్చని అనుమానం..
- అటవీ సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అటవీశాఖ అధికారుల సూచన



భీంపూర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)
ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలో పులి దాడిలో ఓ వ్యక్తి గాయపడిన ఘటనా మండలంలో కలకలం రేపింది.. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని రాజ్జడ్ గ్రామానికి చెందిన గోడం తుకారాం, ఆనంద్ రావ్‌లు ఆదివారం రాములగుట్ట అటవీ ప్రాంతానికి ఆవులను మేపడానికి వెళ్లారు. అడవిలో ఆవులను మెపుతున్నా క్రమంలో ఒక్కసారిగా చెట్ల మాటునుంచి పులి తుకారాంపై దాడి చేసిందని, దీంతో పక్కనే ఆనంద్ రావ్ పెద్ద పెట్టిన అరుపులు, కేకలు వేస్తూ చేతిలో ఉన్న కర్రతో పులిని అడ్డుకునే ప్రయత్నం చేయగా దీంతో పులి అక్కడి నుంచి అటవీ ప్రాంతంలోకి పారిపోయిందని చెబుతున్నాడు. అయితే అప్పటికే తుకారాంను పులి తల మెడ భాగంలో గాయపర్చడంతో ఆనంద్ రావ్ వెంటనే సమాచారాన్ని గ్రామస్థులకు అందించాడు. దీంతో అటవీ ప్రాంతానికి చేరుకున్న గ్రామస్తుల సహాయంతో తుకారాంను అంబులెన్స్‌లో ఆది లాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు రిమ్స్‌కు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఉదయం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడ పులికి సంబంధించి ఎలాంటి ఆనవాళ్లు కినిపించకపోవడంతో అది పులా, లేక చిరుత పులా, లేదా మరేదైనా ఇతర అటవీ జంతువు కావచ్చని అటవీశాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అయితే అటవీ సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పంట చేనులో పనులు త్వరగా ముగించుకొని ఇంటికి రావాలని వారికి సూచించారు. వన్య ప్రాణులకు ఎటువంటి హాని తలపెట్టవద్దన్నారు.

---

# బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలి



మంచిర్యాల, మార్చి 31 (ప్రభాత సమాచారం)
బీసీల రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 42 శాతం రిజర్వేషన్‌ను కేంద్రం స త్వరమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ నీలకంఠేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలో సభ నిర్వహించి అనంతరం రైలులో ఢిల్లీకి బయలు దేరా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చలో హాలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టామని మూడు రో జుల పాటు ధర్నా చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో 42శాతం బీసీ రిజర్వేషన్ తీర్మాణం చేయడం హర్షనీయమని కేంద్రం కూ డ దేశవ్యాప్తంగా బీసీ గణన చేపట్టాలని, రాష్ట్రంలో బీసీ 42శాతం రిజ ర్వేషన్ పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ పా ర్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టిన పోరు గర్జనకు సంబంధించి బీసీ అందరూ ఏకతాటిపై రావడం ఐక్యంగా పోరాడి రిజర్వేషన్ సాధించు కో వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజన్న యాదవ్, రాజ్‌కిరణ్, సాయికృష్ణ, వెంకటేశ్, వేణుగోపాల్, రాయబారపు కిరణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

---

# సమాజ మార్పు కోసం కవులు కృషి చేయాలి

ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)
కవులు సమాజంలో మార్పు కోసం కృషి చేయాలని సినీ రచయిత దర్శక నిర్మాత నాగబాల సురేష్ కుమార్ అన్నారు. వాసవి కన్యక పరమేశ్వరి ఆలయం లో ఆసిఫాబాద్ కవుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాన్ని మంచిర్యాల జిల్లా రాంపూర్ అవాస సరస్వతి శిశుమందిర్ ప్రధానాచార్యులు రావుల రామన్నకు పురస్కారాన్ని అందించి శాలువా జ్ఞాపిక పూలమాలలతో ఆకసం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథి నాగబాల సురేష్ కుమార్ తాను రచించించిన నిన్ను నీవు తెలుసుకో మానవ తాత్త్విక గేయ శతకంలోని కన్ను తెరిస్తే కలల భ్రాంతులు కనులు మూస్తే కమల కాంతులు జీవితమంటే కదనరణము జీవనమంటే కిరణసంగమము అనే పద్య కవితను వినిపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అవధాని సలహాదారులు నారాయణ మూర్తి, వెంకటేశ్వర్లు సమాజం సాహిత్యం అనే అంశంపై ప్రసంగించారు.

---

# ఏప్రిల్ 3న విద్యార్థి సంఘం ఎన్నికలు

గాదిగూడ, మార్చి 31 (ప్రభాత సమాచారం)
పట్టణంలోని పిట్టలవాడ ఆదివాసీ భవనంలో ఏప్రిల్ 3వ తేదీన ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఎన్నికలను నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ జిల్లాధ్యక్షుడు పెందోర్ దాదిరావు సూచించారు. సోమవారం గాదిగూడలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తుడుందెబ్బ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జరిగే ఎన్నికలకు ఆదివాసీలు హాజరుకావాలని కోరారు.



# మిరియాలతో మేలులెన్నో..!

వంటింట్లో ఉండే మసాలా దినుసులతో ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వంటల్లో మసాలాకు వాడే మిరియాలను ఎక్కువగా వాడరు. జలుబు చేసినప్పుడు పాలలో కలిపి తాగడానికి కొన్నిసార్లు టీలో వేస్తుంటారు. ఘాటుగా ఉండే ఈ మిరియాలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. వీటిలోని పోషకాలు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఉపయోగపడతాయి. కేవలం జలుబు చేసినప్పుడే కాకుండా అప్పుడప్పుడు కూడా మిరియాలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల బోలెడన్నీ ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా ఈ మిరియాల్లో నెయ్యిని కలిపి తినడం వల్ల అనారోగ్య సమస్యలు దరిచేరవని నిపుణులు అంటున్నారు. నెయ్యిలోని పోషకాలు శరీర ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి బాగా సహాయపడతాయి. మిరియాలు, నెయ్యి కలిపి డైలీ తినడం వల్ల అన్ని రకాల అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందుతారని నిపుణులు చెబుతున్నారు. ఎన్నో శతాబ్దాల నుంచి దీన్ని సూపర్ ఫుడ్‌గా భావిస్తారు. ఈ రెండింటిలోని కెరోటిన్, విటమిన్ ఎ, సి, ఫ్లేవనాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఆరోగ్యానికి ప్రయోజనాలను చేకూరుస్తాయి. మరి ఆ ప్రయోజనాలేంటో ఈ తెలుసుకోవాలంటే ఈ స్టోరీలో చూద్దాం.

**కంటి ఆరోగ్యం**

నెయ్యి, మిరియాలు కలుపుకుని తినడం వల్ల కళ్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ రెండింటిలో విటమిన్ ఎ, డి, ఇ, కె పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి సమస్యలు రాకుండా కాపాడుతుందని నిపుణులు అంటున్నారు. రోజూ కూడా టేబుల్ స్పూన్ నెయ్యిలో మిరియాలు వేసుకుని తింటే కంటి చూపు మెరుగుపడుతుంది.

**జలుబు, దగ్గు నుంచి విముక్తి :**

రోజూ ఉదయం పూట ఇలా తినడం వల్ల దగ్గు, జలుబు, ఉబ్బసం, ఛాతీ నొప్పి వంటి సమస్యలు తగ్గుతాయి. దీర్ఘకాలికంగా దగ్గుతో బాధపడుతున్నట్లయితే నల్ల మిరియాలు, నెయ్యిని కలిపి తింటే వెంటనే సమస్య తగ్గిపోతుందని నిపుణులు అంటున్నారు. సాధారణంగా మిరియాలను పౌడర్ చేసి పాలలో వేసుకుని తాగినా కూడా మంచి దగ్గు, జలుబు తగ్గుతాయి. రోగనిరోధక శక్తి మెరుగుపడి ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా కాపాడుతుంది.

**జీర్ణక్రియ ఆరోగ్యం**

నల్ల మిరియాలు, నెయ్యి తీసుకోవడం వల్ల జీర్ణక్రియ ఆరోగ్యం మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. జీర్ణ, కడుపు సంబంధిత సమస్యలు, ఉబ్బరం, గ్యాస్, ఎసిడిటీ వంటివి సమస్యలు కూడా తగ్గుతాయి. కొందరికి తినే ఫుడ్ జీర్ణం కాక మలబద్ధకం తో కూడా ఇబ్బంది పడుతుంటారు. అలాంటివారికి ఈ మిరియాలు, నెయ్యి బెస్ట్ అని చెప్పవచ్చు.

**ఎలా తినాలంటే? :**

ఒక టేబుల్ స్పూన్ నెయ్యిలో నల్ల మిరియాలు వేసి బాగా కలపాలి. వీటిని ఉదయం ఖాళీ కడుపుతో తిని.. గ్లాసు వేడి నీరు తాగాలి. ఇలా దాదాపుగా నెల రోజుల పాటు చేయడం వల్ల అన్ని రకాల అనారోగ్య సమస్యల నుంచి విముక్తి పొందుతారని నిపుణులు చెబుతున్నారు. మీరు ఇలా తిన్న పది రోజుల నుంచే ఫలితాలను చూస్తారు.



# తెలివైన, ఆరోగ్యమైన బిడ్డ కోసం ఇలా చేయండి..

గర్భధారణ సమయంలో ప్రతి తల్లి తన బిడ్డ ఆరోగ్యంగా, అందంగా, తెలివిగా పుట్టాలని కోరుకుంటుంది. ఇందులో చాలా విషయాలు జీన్స్ పై ఆధారపడి ఉంటాయి. అయితే గర్భధారణ సమయంలో కొన్ని విషయాల పట్ల జాగ్రత్త వహిస్తే.. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా తెలివైనదిగా ఉంటుంది. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం..

**బ్యాలెన్స్డ్ డైట్**

గర్భధారణ సమయంలో బ్యాలెన్స్డ్ డైట్ తీసుకోవడం చాలా ముఖ్యం, తద్వారా పుట్టబోయే బిడ్డ శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటుంది. శరీరానికి తగినంత విటమిన్లు, ప్రొటీన్లు అందించే ఆహారాలను డైట్ లో చేర్చుకోవాలి. ఆకుపచ్చ కూరగాయలు, పండ్లు, డ్రై ఫ్రూట్స్, పాల ఉత్పత్తులను సమృద్ధిగా తినాలి.

**మృదువైన సంగీతం**

గర్భధారణ సమయంలో స్త్రీ తేలికపాటి సంగీతాన్ని వింటే.. గర్భంలో పెరుగుతున్న శిశువు తెలివితేటలపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని చెబుతారు. కానీ హెడ్‌ఫోన్‌లు ధరించి అధిక వాల్యూమ్‌లో సంగీతం వినకూడదని గుర్తుంచుకోండి.

**చెడు విషయాలకు దూరంగా**

గర్భధారణ సమయంలో ప్రతికూల విషయాలు, ప్రతికూల ఆలోచనలు మీకడుపులో పెరుగుతున్న బిడ్డపై కూడా చెడు ప్రభావాన్ని చూపుతాయి. అందువల్ల, గర్భధారణ సమయంలో మనస్సును ప్రశాంతంగా, సానుకూలంగా ఉంచుకోవాలి. నెగటివ్ గా మాట్లాడకూడదు, అలాగే నెగటివ్ విషయాలకు దూరంగా ఉండాలి.

**మాట్లాడడం**

పురాణాల ప్రకారం.. గర్భంలో పెరుగుతున్న అభిమన్యుడు తన తల్లిదండ్రుల మాట విని యుద్ధ కళను నేర్చుకున్నాడు. ఇది చాలా వరకు నిజమని నమ్ముతారు. గర్భంలో పెరుగుతున్న శిశువు మీరు చెప్పేది వింటుంది, అర్థం చేసుకుంటుంది. అందుకే గర్భధారణ సమాయంతో శిశువుతో మాట్లాడుతూ ఉండాలి. అలాగే పుస్తకాలు చదవడం చేయాలి. ఇది బిడ్డ మానసిక వికాసాన్ని బలపరుస్తుంది.

**యోగా, ధ్యానం చేయండి**

ప్రెగ్నెన్సీ సమయంలో వైద్యుడిని సంప్రదించిన తర్వాత, మీ దినచర్యలో చిన్న చిన్న యోగాసనాలు ధ్యానాన్ని చేర్చుకోండి. యోగా, ధ్యానం చేయడం ద్వారా శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. గర్భధారణ సమయంలో మానసిక ప్రశాంతత చాలా అవసరం. ఇది పిల్లల మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది.

# పసుపు రంగు డ్రాగన్ ఫ్రూట్ తిన్నారా?



డ్రాగన్ ఫ్రూట్ తినడం ఆరోగ్యానికి మంచిది. ముఖ్యంగా పసుపు డ్రాగన్ ఫ్రూట్ బరువు తగ్గడానికి, మధుమేహాన్ని అదుపులో ఉంచడానికి కూడా సహాయపడుతుంది. డ్రాగన్ ఫ్రూట్ ఒక రుచికరమైన, ఆరోగ్యకరమైన పండు. మార్కెట్లో కాస్త ఖరీదైనప్పటికీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది మంచిదని చెబుతున్నారు. సాధారణంగా మనం గులాబీ రంగు డ్రాగన్ ఫ్రూట్ తిని ఉంటాం. పసుపు డ్రాగన్ ఫ్రూట్ అత్యంత తియ్యగా ఉంటుంది. అంతేకాకుండా వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. పసుపు రంగు డ్రాగన్ పండు లోపల తెల్లటి గుజ్జు ఉంటుంది. ఇది పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్‌తో నిండి ఉంటుంది. ఇది ఆహారంలో తప్పనిసరిగా చేర్చుకోవాలి.

**జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో..**

పసుపు డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. ఇది పేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. పేగు ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. దాని కరిగే, కరగని ఫైబర్ కంటెంట్ కారణంగా జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఈ పండులో నీటి శాతం పుష్కలంగా ఉంటుంది. ముఖ్యంగా వేడి వాతావరణంలో హైడ్రేటెడ్‌గా ఉండటానికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్‌గా ఉంచుకోవడం వల్ల శక్తి స్థాయిలను నిర్వహించడానికి, అవయవ పనితీరుకు మద్దతు ఇవ్వడానికి, ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. పసుపు డ్రాగన్ ఫ్రూట్ తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉంటుంది. ఇది డయాబెటిస్ ఉన్నవారికి అనుకూలంగా ఉంటుంది. పండ్లలోని ఫైబర్ కంటెంట్ రక్తంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తుంది.

సమతుల్య ఆహారంలో దీన్ని చేర్చుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు స్థిరంగా ఉంటాయి. పసుపు డ్రాగన్ ఫ్రూట్ విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లకు నిలయం. ఆరోగ్యకరమైన, మెరిసే చర్మానికి దోహదం చేస్తుంది. దీనిలోని నీటి శాతం చర్మాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. చర్మాన్ని యవ్వనంగా కనిపించేలా చేస్తుంది. అలాగే యాంటీ ఆక్సిడెంట్లు UV కిరణాలు, కాలుష్యం వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షిస్తాయి. బరువు తగ్గడాన్ని ప్రోత్సహించే పండ్ల కోసం చూస్తున్నట్లయితే పసుపు డ్రాగన్ పండు బెస్ట్. ఈ పండులో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండినట్లు ఉంచడమే కాకుండా తరచుగా తినాలనే కోరికను కూడా తగ్గిస్తుంది.

# బెల్లీ ఫ్యాట్‌తో ప్రాణాంతక వ్యాధి..

సాధారణంగా ఊబకాయం అనేక వ్యాధులకు దారితీస్తుంది. దీనివల్ల రక్తపోటు, గుండెపోటు వచ్చే ప్రమాదాలు ఎక్కువగా ఉంటాయి. అయితే తాజా పరిశోధనల్లో మరో షాకింగ్ విషయం వెల్లడైంది. బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోవడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. నేషనల్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ జర్నల్‌లో ఈ పరిశోధన ప్రచురించబడింది.

స్వీడిష్ ప్రజలపై పరిశోధన జరిగింది ఈ పరిశోధన కోసం 51 సంవత్సరాల వయస్సు గల 340,000 మంది స్వీడిష్ ప్రజల డేటాను విశ్లేషించారు. దీనిలో వారి బాడీ మాస్ ఇండెక్స్, నడుము చుట్టుకొలతను 14 సంవత్సరాల వరకు పరిశీలించారు. ఈ గణాంకాలను పోల్చి చూస్తే, 14 సంవత్సరాలలో 18,185 మందికి ఊబకాయం సంబంధిత క్యాన్సర్లు నిర్ధారణ అయినట్లు కనుగొనబడింది. ముఖ్యంగా పురుషులలో నడుము చుట్టుకొలత పెరిగే కొద్దీ క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. బెల్లీ ఫ్యాట్ 11 సెం.మీ పెరిగితే క్యాన్సర్ ప్రమాదం 25 శాతం పెరుగుతుంది. అదే సమయంలో, మహిళల్లో బెల్లీ ఫ్యాట్ 12 సెం. పెరిగితే క్యాన్సర్ వచ్చే ప్రమాదం 13 శాతం ఉంటుందని అధ్యయనంలో తేలింది.



**ఊబకాయం కారణంగా పెద్దప్రేగు క్యాన్సర్, కాలేయ క్యాన్సర్, పిత్తాశయం, ప్యాంక్రియాస్, అండాశయం, రొమ్ము, మెనింగియోమా, థైరాయిడ్ , అన్నవాహిక క్యాన్సర్, గ్యాస్ట్రిక్ క్యాన్సర్, మల్టిపుల్ మైలోమా వంటి క్యాన్సర్ల ప్రమాదం పెరుగుతుంది. చాలా మంది పురుషులలో బొడ్డు చుట్టూ కొవ్వు ఎక్కువగా పేరుకుపోతుంది.**

# కొలెస్ట్రాల్‌ను నిర్లక్ష్యం చేస్తే ఎలాంటి నష్టాలు ఉంటాయి?

అధిక కొలెస్ట్రాల్ అనేది చాలా మందిని పీడిస్తున్న ప్రమాదకరమైన ఆరోగ్య సమస్య. మన గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ముఖ్యంగా LDL, లేదా చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉన్నప్పుడు, HDL తక్కువగా ఉన్నప్పుడు అది ధమనులలో ఫ్లాక్ ఏర్పడటానికి దారితీస్తుంది.

**గుండెకు రక్త ప్రవాహం:**

ఈ ఫలకం అధిక కొలెస్ట్రాల్‌ను కలిగి ఉంటుంది. ఇది పెరిగినప్పుడు గుండె జబ్బుల ప్రమాదం పెరుగుతుంది. కాబట్టి ఎప్పుడూ కొలెస్ట్రాల్‌ను నియంత్రణలో ఉంచుకోవాలి. కొలెస్ట్రాల్ కారణంగా ధమనులు మూసుకుపోవడం వల్ల గుండెపోటు లేదా స్ట్రోక్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. గుండెకు రక్త ప్రవాహం తగ్గితే మూత్రపిండాల సమస్యలు వస్తాయి. అంతే కాదు పెరిగిన కొలెస్ట్రాల్ స్థాయిలు జ్ఞాపకశక్తి సమస్యలు, అల్జీమర్స్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతాయి. చెడు కొలెస్ట్రాల్ అధిక స్థాయిలో ఉండటం వలన అథెరోస్క్లెరోసిస్ వస్తుంది. అంటే ధమనులు గట్టిపడటం, సంకుచితం కావడం జరుగుతుంది. ఇది గుండెపోటు, కరోనరీ ఆర్టరీ వ్యాధికి దారితీస్తుంది. కొలెస్ట్రాల్‌ను సరిగ్గా నియంత్రించడం ద్వారా ధమనులు స్పష్టంగా ఉంటాయి. గుండెపై ఒత్తిడి తగ్గుతుంది. అధిక కొలెస్ట్రాల్ తరచుగా ఇన్సులిన్ నిరోధకతతో ముడిపడి ఉంటుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. కొలెస్ట్రాల్‌ను సరైన స్థాయిలో నిర్వహించడం వల్ల రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది. అదనంగా కొలెస్ట్రాల్‌ను నియంత్రించడం వల్ల తీవ్రమైన గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.








# భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- నాలుగు జిల్లాల్లో వేడుకగా ఈద్ - ఉల్ - ఫితర్
- ఈద్గాల్లో ప్రత్యేక నమాజులు
- ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

**ఆదిలాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)** రంజాన్ పండుగ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల్లోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రంగినేని మనీషా, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీ మాజీ అధ్యక్షులు సాజిత్ ఖాన్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచి శ్రీకాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు.

**మత సామరస్యానికి ప్రతీక రంజాన్..**
**ఎమ్మెల్యే ప్రేం సాగర్‌రావు**

**మంచిర్యాల :** మత సామర స్యానికి, శాంతికి, ఐక్యతకు ప్రతీకగా రం జాన్ పండుగ నిలుస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పేర్కొ న్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మ సీదుల్లో మైనార్టీలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పాల్గొని ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఆ యన మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని హిందూ, ముస్లింలు అంద రూ కలిసి మెలిసి ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడపించేందుకు ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఫరంజాన్ మాసం సందర్భంగా 30 రో జుల పాటు ఉపవాస దీక్షలు చేయ డం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుందని బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నీలకంతేశ్వరావు పేర్కొన్నారు. సోమవారం రంజాన్‌ను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని పురాణ మసీదులో ప్ర త్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సో దరులకు మిఠాయిలు తినిపించారు. మై నార్టీ సంఘం నాయకులు అబీద్, మత పెద్ద ఇక్రముల్ హక్, ఎండీ షకీల్, సోహె ల్‌ఖాన్, తాజోద్దీన్, పాల్గొన్నారు. పట్టణంలో సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం లు ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు. సీసీ సీ సుందరయ్య కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీలోని ఈద్గాల వద్ద ఉదయం నమాజ్ చేసి రంజాన్ పండగ శుభాకాంక్షలను ఒక్కరినొకరు తెలియజేసుకున్నారు. వివిధ రాజకీయ పార్టీ నేతలు ముస్లింలకు శుభా కాంక్షలు చెప్పారు.

**ఘనంగా రంజాన్ వేడుకలు..**

**మందమర్రి :** నెల రోజుల కఠిన ఉపవాసాల అనంతరం నెలవంక దర్శనంతో ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. సోమవారం పట్టణంలోని సిఈఆర్ క్లబ్ సమీపంలో, విద్యానగర్ లోని ఈద్గాల వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్బంగా మత గురువులు పండుగ యొక్క ప్రాముఖ్యతను బోధించారు. అనంతరం ఒకరినొకరు



ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై రాజశేఖర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మైనారిటీల అభివృద్ధికి కృషి చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని వారి అభివృద్ధికి కృషి చేస్తుందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. రంజాన్ పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులను ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చెన్నూర్ నియోజకవర్గంలో ఈద్గా, దర్గాలను అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

**ముస్లింలకు రస్నా పంపిణీ చేసిన ఏసీపీ..**

బెల్లంపల్లి పట్టణంలోని అశోక్‌నగర్ మస్జిద్ వద్ద సోమవారం రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు బెల్లంపల్లి ఏసిపి ఏ. రవికుమార్ రస్నాను పంపిణీ చేశారు. ముందుగా ముస్లిం సోదరులకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షల అనంతరం ముస్లిం సోదరులు తమ కుటుంబాలతో రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని అభినందనీయమని అన్నారు. నెల రోజులపాటు కట్టిన ఉపవాస దీక్షలు క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, ప్రేమ, దాతృత్వం, సోదర భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఆయన వెంట బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ ఎన్ .దేవయ్యతో పాటు ముస్లిం పెద్దలు ఉన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని బూడిదగడ్డ బస్తీ, అశోక్‌నగర్ మస్జిద్‌ల వద్ద సోమవారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ముస్లింలకు టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ మతసామరస్యానికి నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. కఠిన ఉపవాస దీక్షల అనంతరం ముస్లింలు ఐక్యత భావంతో ఈ పండుగను జరుపుకోవడం సంతోషకరమన్నారు. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ముచ్చర్ల మల్లయ్య,మాజీ కౌన్సిలర్ బండి ప్రభాకర్, బెల్లంపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సన్నీ ముస్లింలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.



**మతాలకతీతంగా రంజాన్ వేడుకలు..**

**ఆసిఫాబాద్ :** మండలంలో వెళ్లే రహదారి సమీపంలో గల ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు,బాలేష్ గౌడ్, మల్లేష్, చరణ్ శుభాకాంక్షలు తెలిపారు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో ఎస్సై ప్రశాంత్ బందోబస్తు నిర్వహిం చారు.

**బెజ్జూరు :** మండల కేంద్రంతో పాటు కుకుడ, మర్తిడి, ఎల్కపల్లి, గోల్కొండ తదితర గ్రామాల్లోని ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు.

**పెంచికలపేట :** మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ముస్లింలు ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించారు. ఎస్సై కొమురయ్య శుభాకాంక్షలు తెలిపారు.

**చింతలమానేపల్లి :** ఎస్సై నరేష్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాబాసాగర్‌లో పండగ శుభాకాంక్షలు తెలిపారు.

**దహెగాం :** మండలంలోని బీబ్రా, గొర్రెగుట్ట, మొట్లగూడ గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**కెరమెరి :** మండలంలోని సుల్తాన్‌గూడ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందో బస్తు నిర్వహించారు.

**సిర్పూర్(టి) :** మండల కేంద్రంలోని కొత్త, పాత ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రెండు ఈద్గాల వద్ద కౌటాల సీఐ రమేష్, ఎస్సై కమలాకర్ పోలీసు సిబ్బందితో బందో బస్తు నిర్వహించారు.

**కాగజ్‌నగర్ :** పట్టణంలో ముస్లింలు రంజాన్ పండుగను ఘనంగా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో పాటు ఆయా పార్టీల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని చింతగూడ, కోయవాగు గ్రామాల్లో రంజాన్ వేడుకల్లో జడ్పీ ఇన్‌చార్జి మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావు, తదితరులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో జడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘట నలు జరుగకుండా పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

**రెబ్బెన:** ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు కేంద్రప్రభు త్వం ప్రవేశ పెట్టబోయే వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా రెబ్బెనలో చేతికి నల్ల బ్యాడ్జిలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు జహీర్ బాబా, ప్రధాన కార్యదర్శి నాజీర్ ఉస్మాని, జాకీర్ ఉస్మానితో పాటు ముస్లింలు పాల్గొన్నారు. ఎస్సై చంద్రశేఖర్ బందోబస్తు చేపట్టారు.

**వాంకిడి :** వాంకిడి, గోయేగాం ఈద్గాల వద్ద ప్రత్యే క ప్రార్థనలు నిర్వహించారు.

**జైనూర్ :** రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. సీఐ రమేష్ ముస్లింలకు శభాకాంక్షలు తెలిపారు.

**సిర్పూర్(యు) :** మండలంలో సోమవారం రంజాన్ పండుగను ముస్లిం సోదారులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలొని ఈద్‌గాలో సోమవారం ఉదయంనే ముస్లిం సోదారులు ప్రత్యేక నమాజ్ అదా చేశారు.అదే విధంగా ఈద్‌గాలో ప్రార్థనాలు చేసిన తరువాత రంజాన్ శుభకంక్షాలు తెలియజెశారు. అదే విధంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రవు, మాజీ సర్పంచులు నాగోరావు, ఆత్రం ఓంప్రకాష్, రాజెశ్వర్, కుమ్ర భీంరావులు ముస్లిం సోదారులకు శుభకంక్షాలు తెలియజెశారు.

**ఘనంగా రంజాన్ వేడుకలు..**

**కాగజ్‌నగర్ :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం కాగజ్‌నగర్ మండలంలోని ఈద్గా వద్ద ముస్లిం మైనారిటీలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.

**ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు..**

**ముథోల్ :** రంజాన్ పర్వదినాన్ని మండల మండల కేంద్రంలో పాటు వివిధ గ్రామాల్లో ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతోఘనంగా జరుపుకున్నారు. సోమవారం రోజు ఈద్గాల వద్దకు అధికసంఖ్యలో చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మత పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నామే రంజాన్ పర్వదినమన్నారు. 30రోజులపాటు కఠోర ఉపవాసదీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు. పంచాయతీ ఈఓ అన్వర్, సిబ్బంది తాగునీటి వసతి కల్పించారు. ఈద్గా వద్ద ముధోల్ సిఐ మల్లేష్, ఎస్సై సంజీవ్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు చేశారు.

**కుభీర్ మండలంలో..**

మండలంలోని రాయపూర్ కాండ్లీ గ్రామంలో మండలానికి చెందిన నాయకులు మతాలకతీతంగా రంజాన్ వేడుకల్లో పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కరిపే శ్యామ్ సుందర్ మాట్లాడుతూ సమాజంలో అందరూ కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ సుదర్శన్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావ్, నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మోహమ్మద్ షఫీ, మండల కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ హర్ష ప్రసాద్, సురేష్, బందు పటేల్,కట్టెకోళ్ల దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.









# మిస్ యూ హ్యాండ్ సమ్

యంగ్ బ్యూటీ మెహ్రీన్ ఫిర్జాదా 'కృష్ణగాడి వీర ప్రేమగాథ' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చి ఫస్ట్ మూవీతోనే మంచి మార్కులు కొట్టేసింది. ఆ తర్వాత ఎఫ్2, ఎఫ్3 సినిమాలతో మరింత క్రేజ్ తెచ్చుకుంది. సినిమాలకు దూరమైన ఈ భామ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టీవ్ గా ఉంటూ నిత్యం అందాల విందు చేస్తోంది. అంతేకాకుండా తన వ్యక్తిగత జీవితం గురించి పంచుకుంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ ముద్దుగుమ్మ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా మెహ్రీన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ స్టోరీ పెట్టింది. అందులో ఓ ముసలి వ్యక్తితో ఉన్న ఫొటో షేర్ చేస్తూ.. హ్యాపియెస్ట్ బర్త్‌డే మై డియర్ హ్యాండ్ సమ్ మ్యాన్.. మిస్ యూ అనే క్యాప్షన్ రాసుకొస్తూ రెడ్ హార్ట్ లవ్ సింబల్ జోడించింది. దాంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్ గా మారింది.



## పూరి దర్శకత్వంలో విజయ్ సేతుపతి

హిట్లతో సంబంధం లేకుండా దర్శకుడు పూరి జగన్నాథ్ సినిమాలను అభిమానించే సినీ ప్రియులు ఎంతో మంది ఉన్నారు. ఆయన సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి విడుదలయ్యేంత వరకు అభిమానులు ఎదురు చూస్తుంటారు. 'లైగర్', 'డబుల్ ఇస్మార్ట్' చిత్రాలు ఫ్లాప్ అయిన తర్వాత ఆయన సినిమాల గురించి ఎలాంటి అప్డేట్ రాలేదు. ఇప్పుడు ఆయన ఫ్యాన్స్ లో జోష్ నింపే అప్డేడ్ వచ్చింది. తమిళ స్టార్ విజయ్ సేతుపతితో పూరి జగన్నాథ్ సినిమా చేయబోతున్నారనే వార్తలు కొన్ని రోజులుగా వస్తున్నాయి. ఆ వార్తలు నిజమయ్యాయి. దానికి సంబంధించిన అఫీషియల్ అప్డేడ్ ఇప్పుడు వచ్చింది. విజయ్ సేతుపతితో సినిమాను తెరకెక్కిస్తున్నట్టు ప్రొడక్షన్ హౌస్ 'పూరి కనెక్ట్స్ ' ప్రకటించింది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నట్టు తెలిపింది. రెగ్యులర్ షూటింగ్ జూన్ లో ప్రారంభమవుతుందని వెల్లడించింది. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇస్తామని తెలిపింది. ఈ సినిమాకు సినీ నటి చార్మి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.






## జాక్ మూవీ నుంచి స్పెషల్ పోస్టర్

హీరో సిద్దు జొన్నలగడ్డ 'టిల్లు స్క్వేర్' సినిమాతో వచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్నాడు. ప్రస్తుతం తెలుసు కదా , జాక్ వంటి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. 'జాక్' మూవీ ఏప్రిల్ 10వ తేదీన థియేటర్స్ లోకి రాబోతుంది. దాదాపు షూటింగ్ పూర్తి చేసుకోవడంతో మూవీ మేకర్స్ ప్రమోషన్స్ జోరు పెంచారు. వరుస అప్డేట్స్ విడుదల చేస్తూ అంచనాలను పెంచుతున్నారు. తాజాగా రంజాన్ పండుగ విషెస్ తెలుపుతూ స్పెషల్ పోస్టర్‌ను షేర్ చేశారు. ఇందులో సిద్దు జొన్నలగడ్డ ఫకీర్ బాబాలా కనిపించారు. అంతేకాకుండా ముస్లీం డ్రెస్ ధరించి పొగ వేస్తూ వెళ్తున్నాడు. ఈ పోస్ట్‌కు మేకర్స్ "జాక్ కేవలం పేరు కాదు. అది ఒక వైబ్. ఇంకా మిస్టరీ బయటపడలేదు" అనే క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం సిద్దు పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ప్రేక్షకుల్లో హైప్ పెంచుతోంది.




## సర్దార్ 2 ప్రోలాగ్ వీడియో విడుదల

2022లో కార్తి హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో వచ్చిన స్పై, యాక్షన్ థ్రిల్లర్ 'సర్దార్' భారీ విజయాన్ని సొంతం చేసుకున్నది. ఇప్పుడు ఈ మూవీకి సీక్వెల్‌గా 'సర్దార్ 2' వస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ 'ప్రోలాగ్' పేరిట ఓ వీడియోను విడుదల చేశారు. ప్రముఖ నటుడు ఎస్‌జే సూర్యను ప్రతినాయకుడిగా పరిచయం చేస్తూ ఈ వీడియోను పంచుకున్నారు. ఇక ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. కార్తి సరసన హీరోయిన్లుగా ఆషిక రంగనాథ్, మాళవిక మోహన్ నటిస్తున్నారు.




## క్రేజ్ మామూలుగా లేదు

హీరోయిన్ వైష్ణవి చైతన్య ఆనంద్ దేవరకొండ సరసన 'బేబీ' మూవీలో నటించి తన యాక్టింగ్ తో ఫుల్ మార్క్స్ కొట్టేసింది. ప్రస్తుతం స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ సరసన 'జాక్' మూవీలో నటిస్తోంది. ఇక ఈ సినిమా సమ్మర్ స్పెషల్‌గా ఏప్రిల్ 10న రిలీజ్ కానుంది. అయితే వైష్ణవి చైతన్య సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం నిత్యం యాక్టీవ్ గా ఉంటూ లేటెస్ట్ ఫొటో షూట్స్, వ్యక్తిగత విషయాలను పంచుకుంటూ ఫ్యాన్స్‌ను పెంచుకుంటుంది. ఈ బ్యూటీకి జాక్ సినిమా తర్వాత కూడా భారీగానే ఛాన్సులు వస్తున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని ఈ భామ కూడా రెమ్యూనరేషన్ భారీగా పెంచేసిందట. ఒక్కో సినిమాకు కోటి రూపాయల దాకా తీసుకుంటుందని టాక్. అంతేకాకుండా ఆమె అడిగినంత ఇవ్వడానికి ప్రొడ్యూసర్స్ కూడా ముందుకు రావడం విశేషం. ఇక ఈ విషయం పై నెటిజన్లు అమ్మడు రేంజ్ మామూలుగా లేదంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# పేదలకు ఇక సన్న బువ్వ



- సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం
- నేటి నుంచి లబ్ధిదారులకు పంపిణీ
- సర్వం సిద్ధం చేసిన అధికారులు..
- ఉమ్మడి జిల్లాలో ముఖ్యనేతలతో ప్రారంభం
- ఆదిలాబాద్ జిల్లాలో 356 చౌక దుకాణాలు
- నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 412 రేషన్ దుకాణాలు
- మంచిర్యాల జిల్లాలో 423 షాపులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తెల్లరేషన్ కార్డుదారులు

**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

ఉగాది కానుకగా రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల నుంచి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానుంది. కార్డు కలిగిన లబ్ధిదారుల కుటుంబంలోని ఒక్కొక్కరికి ఆరుకిలోల చొప్పున సన్నబియ్యం పోసేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇప్పటికే చౌకధరల దుకాణాలకు సన్నబియ్యం స్టాకు కూడా చేరింది. పౌరసరఫరాల అధికారులు దీని కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటివరకు ఆహార భద్రతా కార్డులో పేర్లున్న లబ్దిదారులందరికీ 6కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. ఇక నుంచి ఆ స్థానంలో ప్రతీ లబ్ధిదారుడి పేరిట 6కిలోల సన్నబియ్యాన్ని పంపిణీ చే యనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇ చ్చిన హామీ మేరకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించ నుంది. సన్నబియ్యం పంపిణీపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఆదిలాబాద్ జిల్లాలో ఇలా..**

ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 3వేల మెట్రిక్ టన్నుల బియ్యం రేషన్ దుకాణాలకు చేరింది. జిల్లాలో రేషన్ కార్డులు ఆహారభద్రత, అన్నపూర్ణ కలిపి మొత్తం 1,91,755 ఉన్నాయి. వీటి పరిధిలో 6,49,521 యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం ఉచితంగా అందించనున్నారు. ఇందుకు గాను జిల్లాకు 4,125.474 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. ఈ బియ్యంను నిజామాబాద్ జిల్లా నుంచి సరఫరా చేయాలని నిర్ణయించారు. అక్కడి నుంచి జిల్లాలోని ఐదు ఎంఎల్ఎస్ పాయింట్లకు ఇప్పటి వరకు 3వేల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే చేరాయి. ఇంకా 1,125 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. ఉగాది, రంజాన్ పండుగలు వరుసగా వచ్చిన నేపథ్యంలో బియ్యం సరఫరాలో ఆలస్యమైనట్లుగా అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 356 చౌక దుకాణాలుండగా అందులో ఇప్పటి వరకు 325 దుకాణాలకు సరఫరా చేశారు. మరో 25 షాపులకు చేరాల్సి ఉంది. ఆయా షాపుల్లో బియ్యం అందాకే పంపిణీ ప్రారంభమయ్యే అవకాశమున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 42 రేషన్ షాపులుండగా వాటి పరిధిలోని కార్డుదారులకు అవసరమైన ఈ నెల కోటా బియ్యం పూర్తిస్థాయిలో సరఫరా చేశారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని దుకాణాలకు మాత్రం సర్దుబాటు చేశారు. మండలంలో పది షాపులంటే ఐదారు షాపులకు పూర్తి కోటా బియ్యం అందజేయగా, మిగతా షాపులకు ఒక్కో షాపునకు కనీసంగా ఐదు నుంచి పది క్వింటాళ్ల వరకు సరఫరా చేశారు.

**నిర్మల్ జిల్లాలో..**

నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 412 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందులో 2,02,487 ఆహారభద్రతా కార్డులు ఉన్నాయి. వీరందరికీ నెలకు బియ్యం 4,059 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయి. ఇప్పటికే పౌరసరఫరాల అధికారులు దీని కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటివరకు ఆహార భద్రతా కార్డులో పేర్లున్న లబ్దిదారులందరికీ ఆరు కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. ఇక నుంచి ఆ స్థానంలో ప్రతీ లబ్ధిదారుడి పేరిట 6 కిలోల సన్నబియ్యాన్ని పంపిణీ చేయనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్న బియ్యం పంపిణీని ప్రారంభించనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాతక్మంగా చేపడుతున్న సన్న బియ్యం పంపిణీ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. జిల్లాలో 412 రేషన్ దుకాణాలు.. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 412 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇందు లో 2,02,487 ఆహారభద్రతా కార్డులు ఉన్నాయి. వీరందరికీ నెలకు బియ్యం 4,059 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమ యంలోనే ఈ పథకాన్ని ప్రారంభించాలని చూసినప్పటికీ సరిపడా బియ్యం నిల్వలు లేకపోవడంతో వాయిదా వేస్తూ వచ్చింది. అయితే గత సీజన్‌లో ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంతో రైతులు పెద్ద ఎత్తున సన్నరకం ధాన్యాన్ని పండించారు. దీంతో ప్రభుత్వం ధాన్యాన్ని సేకరించి పంపిణీకి అందుబాటులో ఉంచింది.

**మంచిర్యాల జిల్లాలో..**

మంచిర్యాల జిల్లాలో 423 షాపుల ద్వారా లబ్ధిదా రులకు రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుంది. జిల్లా లో మొత్తం 2,19,106 తెల్ల రేషన్‌కార్డులు ఉండగా సుమారు 7వేలపై చిలుకు మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమవుతాయి. సన్న బియ్యం కోటా కింద జిల్లా వ్యాప్తంగా అన్ని షాపులకు ఇప్పటి వరకు 4143.692 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా జరిగింది. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన రెండు మూడు రోజుల్లో సన్నబియ్యం పూర్తి కోటా చేరే అవకాశాలు ఉన్నాయని పౌరసరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు.

**పేదలకు చేకూరనున్న లబ్ధి...**

రేషన్‌షాపుల్లో సన్నబియ్యం పంపిణీ ద్వారా లబ్ది దారులైన పేదలకు సన్నబియ్యం లబ్ది చేకూరనుంది. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు హర్షం వ్య క్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు షాపుల ద్వారా పం పిణీ అవుతున్న దొడ్డు బియ్యం అనేక మంది తిన కుండా మార్కెట్‌లో సన్నబియ్యం కొనుగోలు చేసి వి నియోగిస్తున్నారు. సన్నబియ్యం ధర క్వింటాకు రూ. 5వేల నుంచి రూ.6వేల వరకు పలుకుతుం డడంతో తలకు మించిన భారమే అయినా కొనుగోలు చేయక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గత సీజన్‌లో రూ.500 బోనస్ వెచ్చించి సన్నరకం ధాన్యం కొనుగోలు చేసింది. గతంలో కాకుండా 37 శాతం బ్యాంక్ గ్యారంటీతో మిల్లర్లకు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కోసం అప్పగించింది. సకాలంలో సన్నబియ్యం చేతికందడంతో ప్రభుత్వం చౌకధరల దుకాణాలకు ఇవ్వడం ద్వారా లబ్దిదారులకు పంపిణీకి సిద్ధమవుతుంది. ఈ నేపథ్యంలో సన్నబియ్యం సరఫరా చేస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికభారం తగ్గినట్లవుతుంది.

**దొడ్డు బియ్యం పక్కదారి...**

ఇప్పటి దాక రేషన్‌షాపుల్లో ఒక్కొక్కరికి ఆరు కి లోల చొప్పున దొడ్డు బియ్యాన్ని ఇస్తుండగా వారు వాటిని తినేందుకు ఆసక్తి చూపడం లేదు. ఆ బియ్యా న్ని కిలో రూ. 10 నుంచి రూ.15 చొప్పున బయట వి క్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో రేషన్‌డీలర్లే బి య్యానికి బదులు లబ్ధిదారుల బయోమెట్రిక్ తీసు కొని నగదు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చి నట్లు తెలుస్తోంది.

**పాతకార్డుదారులకే పంపిణీ...**

ఉగాది కానుకగా తెల్లకార్డు దారులకు ప్రభుత్వం అందించే సన్నబియ్య ప్రస్తుతానికి పాతకార్డుదారులకే అందనున్నాయి. కొత్త రేషన్‌కార్డు దరఖాస్తుదారు లకు సన్నరకం ఇప్పట్లో అందే అవకాశాలు లేవు. కొ త్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారు మరి కొంత సమయం వేచి చూడక తప్పని పరిస్థితులు ఉన్నాయి. రేషన్‌కార్డు చేతికి అందితే తప్ప బియ్యం పొందే అవకాశం లేదు. దీంతో దరఖాస్తుదారులుని రాశకు గురవుతున్నారు. నూతన రేషన్‌కార్డుల జారీలో మార్పులు చేర్పులు అవకాశం కల్పిస్తున్నట్లు ప్రక టించిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కార్డుల పం పిణీ చేయలేదు. సన్నబియ్యం పొందడంతో పాటు రాజీవ్ యువ వికాసం కింద వివిధ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్న రేషన్‌కార్డు తప్పనిసరి. నూతన రేషన్‌కార్డులు జారీకాకపోవడం తో అర్హులైన పలువురు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

**పరిశీలన దశలోనే దరఖాస్తులు...**

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్ర మాల్లో తెల్లరేషన్ కార్డు కోసం నిరుపేదలు దరఖాస్తు చేసుకున్నారు. అదే విధంగా పాతకార్డుదారులు కూ డ కుటుంబంలోని సభ్యుల చేరిక, మార్పులు, చేర్పు ల విషయంలో కూడ దరఖాస్తు పెట్టుకున్నారు. మం డలాలు, గ్రామాలు వార్డుల వారిగా ప్రజాపాలన ద్వారా ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు సేక రించారు. అయితే నెలలు గడిచిన ఈ దరఖాస్తుల పరిశీలన ఇంకా పూర్తికాలేదు. సేకరించిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్హులను తేల్చాల్సి ఉంది. అయితే విచారణ జరపా ల్సిన సంబంధితశాఖల అధికారయంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా కార్డుల పరిశీలన జరగడం లేదు. పరిశీలన జరిపి అర్హులుగా తేల్చిన జాబితాను జిల్లా పౌరసరఫరాల శాఖకు అందిస్తే కొత్తగా పెరిగిన కార్డులు ఆ మేరకు సభ్యుల లెక్క చొప్పున సన్నబియ్యం డిమాండ్‌ను ప్రభుత్వానికి అందజేసే అవకాశం ఉండేది. పరిశీలన పూర్తికాకపోవడంతో ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాక కొత్తకార్డుల జారీ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు.

# ఉపాధిహామీ కూలి పెంపుపై నిరాశ



- పెంచలేదని అనకుండా..
- గతేడాది 28 రూపాయలు పెంచిన ప్రభుత్వం
- ఈసారి కేవలం 7 రూపాయలు మాత్రమే
- ఆశించిన మేరకు పెంచక పోవడంతో నిరాశలో కూలీలు

**ఆదిలాబాద్ ప్రతినిధి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

మహాత్మాగాంధీ ఉపాధిహామీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆశించిన మేరకు వేతనాలు పెంచక పోవడంతో కూలీలు నిరాశకు గురవుతున్నారు. గతేడాది 28 రూపాయలు పెంచిన ప్రభుత్వం ఈసారి కేవలం 7 రూపాయలు మాత్రమే పెంచి వారి ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఇతర వస్తువుల ధరలు పెరుగుతుండగా, వాటికి అనుగుణంగా ఉపాధి హామీ వేతనాలు పెరగడం లేదు. యేటా కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచుతున్నది. 2022లో 12 రూపాయలు పెంచిన ప్రభుత్వం 2023లో రూ.15, 2024లో రూ.28 పెంచగా, ఈసారి అంతకంటే ఎక్కువగానే పెరు గుతుందని ఆశించారు. ప్రస్తుతం ఉపాధిహామీ కూలీ వేతనం రూ.300 ఇస్తుండగా, పెంచిన 7 రూపాయలతో 307కు చేరుకున్నది. పెంచిన వేతనాలు ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. పథకం ఆరంభంలో పూర్తి స్థాయి కూలీ 87.50 రూపాయలు ఉండగా, పద్దెనిమిదేళ్లలో 219.5 రూపాయలు పెరగడం గమనార్హం.

**2005-06లో ఉపాధిహామీ పథకానికి చట్టబద్ధత..**

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు లేని సమ యంలో కూలీలకు ఉపా?ధి పనులు కల్పించేందుకు 2005-06లో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి చట్టబద్ధత కల్పించింది. కూలీల వలసలను నియంత్రించి స్థానికంగానే ఉపాధి పనులను గుర్తించి పని కల్పించే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని తీసుకవచ్చారు. ఈ పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి ఏడాదికి 100 పని దినాలు కల్పించాలని చట్టంలో పేర్కొన్నారు. యేటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఉపాధిహామీ పథకం సిబ్బంది, అధికారులు గ్రామసభలు నిర్వహించి పను లను చేపడుతున్నారు. కేటాయించిన బడ్జెట్‌లో తప్పని సరిగా 60 శాతం నిధులను కూలీలకు వేతనాల కింద చెల్లించి, 40 శాతం నిధులను మెటీరియల్ కంపొనెంట్ పనుల కోసం వెచ్చించాల్సి ఉంటుంది. ఈ పథకం కింద మొత్తం 206 పనులను గుర్తించారు. 18 ఏళ్లుగా ఈ పథకం ద్వారా గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించ డంతో పాటు సీసీ రోడ్డు నిర్మాణాలు, మురికి కాలువలు, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ భవనాలు, స్వశక్తి భవనాలు, రైతువేదికలు, సెగ్రిగేషన్ షెడ్లు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, తదితర శాశ్వత పనులు చేపట్టారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెరువుల్లో పూడికతీత పను లు మినహా వ్యవసాయ అనుబంధ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం పేర్కొంది.

# పెరిగిన టోల్ చార్జీలు

**అర్ధరాత్రి నుంచి పెరిగిన చార్జీలు అమలు - నిర్మల్ జిల్లాలో రెండు టోల్ ప్లాజాలు**

**నిర్మల్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

జాతీయ రహదారులపై వసూలు చేసే టోల్ చార్జీలు పెరిగాయి. రాష్ట్రంలో ఉన్న 29 ప్లాజాల్లో హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సవరించింది. పెరిగిన చార్జీలు సోమవారం అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చాయి. ఆయా రోడ్ల నిడివి, వెడల్పు, వాటి మీద ప్రయాణించే వాహనాల సంఖ్య, టోల్ గేట్ల సామర్థ్యం, నిర్వహణ వ్యయం.. పలు అం శాల ప్రాతిపదికగా టోల్ ధరలను సవరించారు. జిల్లాలో సోన్ మండలం గంజాల్లో ఒకటి, దిలావ ర్పూర్ మండల కేంద్రంలో ఒక టోల్లో జా ఉన్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి హైద రాబాద్ వెళ్లే మార్గంలో 10 కిలోమీటర్ల దూరంలో గంజాల్ టోల్ ప్లాజా, భైంసా వెళ్లే మార్గంలో 13 కిలోమీటర్ల దూరంలో దిలావర్‌పూర్ టోల్ ప్లాజాలు ఏర్పాటు చేశారు. కనీస సౌకర్యాలు కరువు.. టోల్ చార్జీలను కేంద్రం పెంచింది. నిర్మల్ భైంసా 61వ జాతీయ రహదారిపై దిలావర్పూర్ సమీపంలో ఉన్న టోల్ గేట్ నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో వాహనదారులపై మరింత భారం పడింది. ఈ టోల్ గేట్ ద్వారా నిత్యం రూ.2.38 లక్షల టోల్ వసూలవుతోంది. పెంచిన చార్జీలతో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. రహదారిపై ఎలాంటి నాణ్యతా చర్యలు తీసు కోకున్నా, వేగాన్ని గుర్తించే సూచిక బోర్డులు ఏర్పాటు చేయకున్నా, టోల్ చార్జీలు పెంచుతూ పోతున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వ్యవసాయాధికారుల

## ఫోన్ నెంబర్లు మార్పు

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని వ్యవసాయ శాఖలో విధులు నిర్వహిస్తున్న అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రావురి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. జిల్లా, డివిజన్, మండల వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు మారాయని రైతులు గమనించాలని కోరారు.

8977748730 జిల్లా వ్యవసాయ అధికారి ఆసిఫాబాద్.
8977748780 ఏడిఏ(టెక్నికల్)
8977748790 ఏవో (టెక్నికల్)
8977748799 ఏవో (టెక్నికల్)
8977748801 ఏవో (టెక్నికల్)

వ్యవసాయ సహాయ సంచాలకులు
8977748810 ఆసిఫాబాద్
8977748816 కాగజ్ నగర్
8977748819 సిర్పూర్-(యూ)

మండల వ్యవసాయ అధికారులు
8977748820 ఆసిఫాబాద్
8977748869 తిర్యాని
8977748870 వాంకిడి
8977748846 రెబ్బెన
8977748836 కాగజ్‌నగర్
8977748826 బెజ్జూర్
8977748827 చింతలమనేపల్లి
8977748834 దహెగాం
8977748842 కౌటాల
8977748845 పెంచికల్‌పేట్
8977748860 సిర్పూర్ (టీ)
8977748835 జైనూర్
8977748837 కెరమెరి
8977748843 లింగాపూర్
8977748867 సిర్పూర్ (యూ)

మండలాల చెందిన రైతులు వ్యవసాయ రంగంలో కావలసిన సూచనలు, సలహాలు, సమస్యలను తెలియజేసినందుకు నంబర్లను సంప్రదించాలని సూచించారు.



# గోలీ సోడా రీ బ్రాండింగ్



భారత రుచికి ప్రపంచం దాసోహం

## అంతర్జాతీయంగా పెరుగుతున్న ఎగుమతులు

- నాణ్యతతో ప్రజాదరణ
- గల్ఫ్, అమెరికా, యూకెల్లో విక్రయాలు అధికం

**(ప్రభాత సమాచారం, వెబ్ డెస్క్)**

భారత్ లో ఒకప్పుడు అత్యంత ప్రాచుర్యం పొందిన గోలీ సోడా (గోలి పాప్) ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ దక్కించుకుంటుంది. భారత్ లోనే గాకుండా, విదేశాల్లోనూ ప్రజాదరణ పొందుతున్న గోలీ సోడా ఎగుమతులను పెంచేందుకు అపెడా (ఏపీఈడీఏ- అగ్రికల్చరల్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్ పోర్ట్ డెవలప్ మెంట్ అథారిటీ) వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నది. స్వదేశీ పానీయాలను ప్రపంచ వ్యాప్తంగా ప్రోత్సహిస్తూ ఎగుమతులు పెరిగేలా చేస్తున్నది. ఇప్పటికే భారత గోలీ సోడాకు అమెరికా, యూకె, యూరప్, గల్ఫ్ మార్కెట్లలో జనాదరణ దక్కించుకొని ఎగుమతుల్లో పెరుగుదల నమోదవుతున్నది. అయితే అప్పటి గోలీ సోడానే నేడు గోలి పాప్ సోడాగా పేరు మార్చిన అపెడా ఎగుమతులను పెంచగలిగింది. అంతేగాక ప్యాకింగ్, లేబులింగ్, ఆరోగ్యకరమైన పానీయంగా రూపుదిద్దడంలో విజయవంతమైంది. దాంతో భారత గోలీ సోడాకు విదేశాల్లోనూ ఆదరణ పెరుగుతున్నది. గల్ఫ్ లో అతిపెద్ద రిటైల్ చైన్ లో ఒకటైన లులూ హైపర్ మార్కెట్ పెద్ద ఎత్తున గోలీ సోడాలను దిగుమతి చేసుకుంటుంది.






### భారత వారసత్వ పానీయం..

ప్రపంచ వేదికపై భారత్ గొప్ప పానీయాల వారసత్వాన్ని ప్రదర్శిస్తూ సత్తా చాటుతున్నది. అధిక నాణ్యత గల గోలీ సోడా ఉత్పత్తులను అందజేస్తూ విదేశీయుల నోటికి అసలైన రుచుల మేళవింపును ప్రదర్శిస్తుంది. దాంతో క్రమేణా అంతర్జాతీయ మార్కెట్ లో కూడా గోలీ సోడా (గోలి పాప్ సోడా)కు ఆదరణ పెరుగుతూ ఎగుమతుల్లో వృద్ధి నమోదవుతున్నది. ఎన్నో రకాల బహుళ జాతీయ సంస్థల శీతల పానీయాల రాకతో దాదాపు కనుమరుగైపోయిందనుకున్న భారతీయ గోలీ సోడా అంతకంటే రెట్టింపు వేగంతో మార్కెట్ లోకి అడుగుపెట్టి ఆరోగ్యానికి ఆరోగ్యం, నాణ్యత, రుచి మేళవింపులతో కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నది. దాంతో వీటిని సేవించిన వారు మళ్ళీ మళ్లీ గోలీ సోడానే డిమాండ్ చేస్తుండడంతో వీటి ఎగుమతులు పెరిగాయి.

### గోలి పాప్ సోడాకు గుర్తింపు..

వీటి ప్యాకేజింగ్ , రుచి, నాణ్యత, రీ బ్రాండింగ్ వంటి విషయాల్లో అపెడా ఎన్నో జాగ్రత్తలు కూడా తీసుకున్నది. ఫలితంగా అంతర్జాతీయ మార్కెట్లను ఆకర్షించగలిగింది. ఇటీవలే ఇంటర్నేషనల్ ఫుడ్ అండ్ డ్రింక్ ఈవెంట్ లండన్ లో గోలీ సోడా (గోలి పాప్ సోడా) ప్రదర్శనలో మేటిగా నిలిచింది. దాంతో ఎగుమతులు మరింత పెరిగాయి. భారత దేశ వైవిధ్యమైన వ్యవసాయ, ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఒక విలువైన వేదికగా ఐఎఫ్ ఈ నిలిచింది. భవిష్యత్ లో గోలీ సోడా ఓ పెద్ద పరిశ్రమగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మొత్తానికి భారతదేశ శీతల పానీయం గోలీ సోడా ఎండలోనూ కూల్ కూల్ చేస్తుంది.

# ఆఖరి మజిలీ.. కష్టాలు తీరేదెప్పుడో?



**జిల్లా కేంద్రంలో ఒకటే శ్మశానవాటిక - అందులోనూ కనీస సౌకర్యాలు కరువు**
**వాగులు, ఒర్రెలలో దహన సంస్కారాల నిర్వహణ - మూడుకాలాల్లోనూ తప్పని ఇబ్బందులు**

**అంతిమయాత్రకు అవస్థలు తప్పడం లేదు.. జిల్లా కేంద్రంలో జనాభాకు సరిపడా నాలుగు శ్మశాన వాటికలుం డాలనేది ప్రజల డిమాండ్. కానీ ఒకటి మాత్రమే అందుబాటులో ఉంది. అది కూడా కనీస సౌకర్యాలు లేక నిరుపయోగాంగా మారింది. దీంతో దహన సంస్కారాలను వాగులో, ఒర్రెలలో కానిచ్చేస్తున్నారు. వాగులు పొంగితే బాధలు చెప్పనలవి కాదు.**

**ఆసిఫాబాద్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

కొన్ని సంవత్సరాల క్రితం పెద్దవాగు నదితీరాన నిర్మించిన శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం మాత్రం దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో శ్మశాన వాటికలను నిర్మించింది. కానీ జిల్లా కేంద్రంతోపాటు మండలంలో చాలావరకు నిర్మించిన శ్మశాన వాటికలు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మండలంలో మొత్తం 27 గ్రామాల్లో వైకుంఠదామాలను నిర్మించగా పూర్తిస్థాయిలో వసతులు కల్పించక పోవడంతో కనీసం 90శాతం వరకు వినియోగంలోకి రాలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

**తప్పని ఇబ్బందులు..**

మూడుకాలాల్లోనూ దహన సంస్కారాలకు జిల్లా కేంద్రం లోని ప్రజలకు ఇబ్బందులే. ముఖ్యంగా వర్షాకాలం దురదృష్టవ శాత్తు ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు నరకం చూడాల్సిందే. జిల్లా కేంద్రంలోని సుమారు 40వేలకు పైగా ఉన్న జనాభాకు కనీసం నాలుగు ప్రాంతాల్లో శ్మశాన వాటికలు నిర్మించాల న్న డిమాండ్ ప్రజల్లో ఉంది. ఎట్టకేలకు ఒకటి నిర్మించినా అది నిరుపయోగంగా మారింది. దీంతో వాగులు, వంకలు, ఒర్రెల సమీపంలో దహన సంస్కారాలు చేస్తున్నారు. అకస్మాత్తుగా వాగులు పొంగితే దహనసంస్కారాలకు తీవ్ర ఇబ్బం దులు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరీ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. అధికారులు చొరవ చూపి శన్మానవాటికల్లో కనీస వసతులు కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తా

## ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



**ఖానాపూర్, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

వేసవిలో నెలకొన్న తాగునీటి సమస్యల కోసం శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూం కాలనీలో సోమవారం ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ పర్యటించారు. డబుల్ రూమ్ కాలనీ ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని ఆయన అన్నారు. మహిళా సహాయక సంఘాలుగా ఏర్పడితే ఫిల్టర్ వాటర్ ప్లాంట్ ను అందజేస్తామని పేర్కొన్నారు. స్వయంగా కాలనీ వాసులకు నీటిని వినియోగించుకోవడంతో పాటు ఉపాధి దొరుకుతుందన్నారు. ఫోన్ సిగ్నల్ సరిగా రావడం లేదని, రేషన్ సరుకుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటునట్లు కాలని వాసులు ఎమ్మెల్యేకు వివరించగా త్వరలోనే కాలనీలో తాత్కాలికంగా అంగన్వాడి కేంద్రం, రేషన్ సరుకులు కాలనీలో అందేటట్లు చర్యలు తీసుకుంటామని, సిగ్నల్ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

**సోదర భావంతో పండుగలు జరుపుకోవాలి..**

కుల, మత భేదం లేకుండా, సోదర భావంతో పండుగలను జరుపుకోవాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఖానాపూర్ పట్టణంలోని ఈద్గా వద్ద జరిగిన రంజాన్ పర్వదిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని ముస్లిం సోదరులను ఆలింగణం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు నెల రోజుల పాటు జరిగే ఉపవాసాలను నియమ నిష్టలతో తరతరాలుగా ఆచరిస్తూ వస్తున్న రంజాన్ చివరి మాసమని ఆయన అన్నారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా కలిసికట్టుగా అన్ని పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పేర్కొన్నారు. సోదర భావంతో కలిసి మెలిసి మెలగాలని నియోజకవర్గ ప్రజలను ఎమ్మెల్యే కోరారు. మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ మజీద్, పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజుల సత్యం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జహీర్, ముస్లిం సోదరులు జహీర్ మహమ్మద్, అబ్దుల్ సత్తార్, ఎండి మజీద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విలేజ్ పోలీస్ ఆఫీసర్ వ్యవస్థను పున:ప్రారంభించాలి

## ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ (జైనథ్), మార్చి 31 (ప్రభాత సమాచారం)**

పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ విలేజ్ పోలీస్ వ్యవస్థను పున: ప్రారంభించాలని ఎస్పీ అఖిల్ మహా జన్ అన్నారు. సోమవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి, పరిసరాలను పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈమేరకు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లలో రికార్డుల నిర్వహణ, నవీకరణ ప్రతిరోజు సరైన సమయంలో నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్ కేటాయించి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను విలేజ్ పోలీస్ ఆఫీసర్ ద్వారా పరిష్కరించే దిశగా వ్యవస్థను నిర్మించాలని తెలిపారు. పోలీసు మీకోసం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని, సిబ్బందికి ఎలాంటి సమస్యలున్నా ధైర్యంగా తెలపాలని, వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మండలంలో ఉన్న రౌడీలపై సరైన రౌడీ షీట్లు ఏర్పాటుచేసి ప్రతిరోజు పర్యవేక్షించాలి అని తెలిపారు. గంజాయి పూర్తిగా నిర్మూలించే వరకు సమాచార వ్యవస్థను మరింత పటిష్టంగా మెరుగుపరచుకొని మాదకద్రవ్యాలను పూర్తిగా అరికట్టాలని తెలిపారు. బ్లూ కోర్ట్, 100 డైల్ ప్రతిరోజు పెట్రోలింగ్ గస్తీ నిర్వహిస్తూ అసాంఘిక కార్యకలాపాలైన నిర్వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్పి జీవన్ రెడ్డి, జైనథ్ సిఐ సాయినాథ్, ఎస్సై పురుషోత్తం, సిబ్బంది ఉన్నారు.

# భీమిని కస్తూరిబా విద్యాలయంలో విచారణ

- విద్యార్థినీలను కొట్టింది బయోసైన్స్ టీచర్
- విచారణ అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్న అధికారులు






**బెల్లంపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

గత నెల 28న భీమిని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినీలను చితకబాదిన ఘటనపై జిల్లా కలెక్టర్ సీరియస్ అయ్యారు. దీనిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నివేదిక అందజేయాలని స్థానిక మండల విద్యాధికారిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో సోమవారం భీమిని ఎంఈఓ క్రిష్ణమూర్తి, సెక్టోరియల్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తిలు ఉపాధ్యాయినిలు, విద్యార్థినిలతో విచారణ జరిపారు. గత నెల 28న ఇన్చార్జి స్పెషల్ ఆఫీసర్ (ఎస్వో), తెలుగు ఉపాధ్యాయురాలు శారద సెలవులో ఉన్నట్లు నిర్ధారణ అయిందన్నారు. ఇన్‌చార్జీ ఎస్ఓ శారద విద్యార్థినిలను కొట్టినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలు వాస్తవం కాదని తెలిపారు. 6, 8వతరగతి విద్యార్థినిలు తేజస్విని, భవాని, సుప్రజలు తన వద్ద కాస్మోటిక్ వస్తువులు కొనడం లేదని బయోసైన్స్ ఉపాధ్యాయురాలు వారిని కొట్టినట్లు విచారణలో తెలిసిందన్నారు. విచారణ అనంతరం నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు వారు తెలిపారు.

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో

# వడగళ్ల వానలు.. ఆరెంజ్ అలర్ట్ జారీ

**ఆదిలాబాద్,మార్చి31(ప్రభాత సమాచారం)**

రాగల మూడు రోజులు ఉరుములు, మెరుపులు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భూ ఉపరితలం వేడెక్కడంతో జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 1 నుంచి 3 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే వీలుందని, 4న వర్ష ప్రభావం తక్కువగా ఉండే అవకాశముందని పేర్కొంది. వర్షాల కారణంగా 2, 3 తేదీల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆదిలాబాద్, నిర్మల్, కుమరం భీం అసిఫాబాద్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. పలు చోట్ల ఈదురు గాలులు కూడా వీస్తాయని తెలిపింది.

**అలెర్ట్ జారీ...**

ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ద్రోణి కారణంగా మంగళవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడి వర్షాలు ఆదిలాబాద్, కుమరం భీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జిల్లాలలో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆయా జిల్లాలలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. బుధవారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో కూడిన వర్షాలతో పాటు వడగండ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాలలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

## గ్రూప్-1 ఫలితాల్లో

# గిరిజన యువతి సత్తా

### రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు - ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంకు



**దండేపల్లి, మార్చి 31 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గిరిజన యువతి బానావత్ వనజ గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 38వ ర్యాంకు సాధించింది. రైతు బానావత్ దశరథ్ -లలిత దంపతుల మూడో కుమార్తె వనజ కష్టపడి చదివి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మొదటి ర్యాంకు తెచ్చుకున్నది. దండేపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసింది. ఐటీడీఏ స్కాలర్‌షిప్‌తో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ కాలేజీలో ఇంటర్ ఇంగ్లిష్ మీడియం పూర్తి చేసింది. కాకతీయ యూనివర్శిటీలో డిగ్రీ, పీజీ చదివింది. మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో చేరి సివిల్స్‌కు సిద్ధమైంది. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-4 పరీక్షలో ఎస్టీ విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం సాధించింది. తర్వాత జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల్లో ర్యాంకు సాధించింది. వారం క్రితమే వరంగల్ జూనియర్ కళాశాలలో ఉద్యోగంలో చేరింది. ఇప్పుడు గ్రూప్-1 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 504.5 మార్కులు సాధించి 38వ ర్యాంకు తెచ్చుకున్నది. వనజకు డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగం వస్తుందని భావిస్తున్నారు. వనజను కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు, స్థానికులు ఆమెను అభినందించారు.